Follow: @ANNTELUGU
18-08-2025
# ANN తెలుగు మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 255 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## బిగ్ బాస్ అగ్నిపరీక్షకు ఎఎన్ఎన్ నర్సయ్యతాత


**సీజన్ 9 అగ్ని పరీక్ష ప్రోమోలో నర్సయ్య తాత**

**ఎఎన్ఎన్ లో దుమ్మురేపుతున్న నర్సయ్య తాత కార్యక్రమాలు**

హైదరాబాద్, మహా: లక్షలాది మంది వెళ్ళాలని ఆశపడే.. ఎదురుచూసే బిగ్ బాస్ హౌజ్ లోకి ఎఎన్ఎన్ ఛానల్ జర్నలిస్ట్, యాంకర్, రచయిత, గాయకుడు నర్సయ్య తాత అడుగుపెట్టాడు. బిగ్ బాస్ అగ్నిపరీక్షలో నర్సయ్య తాత ఎక్సర్ సైజ్ చేస్తున్న వీడియోలు, పార్టిసిపెంట్ యువతులతో ఆటలు.. తొలి ప్రోమోలో ప్రత్యక్షమయ్యాయి. దీంతో నర్సయ్య తాతకు శుభాకాంక్షల వెల్లువ సాగుతోంది. ఎఎన్ఎన్ ఛానల్ లో మార్నింగ్ న్యూస్ విత్ నర్సయ్య తాత, తగ్గేదెలే.. నర్సయ్యతాత తో రప్పారప్పా కార్యక్రమాలు గత ఏడాదికాలంగా ప్రజాదరణ పొందాయి. ఇంటర్వ్యూలు, పొలిటికల్ ప్రోగ్రామ్ లు, పాటలతో నర్సయ్య తాత అదరగొట్టాడు. ఈ ఆదరణే నర్సయ్యతాతను బిగ్ బాస్ అగ్నిపరీక్ష వరకు చేర్చింది. ఆ అగ్నిపరీక్షలో నర్సయ్యతాత ఎంతవరకు నిలిచాడు.. గెలిచాడు.. అసలు బిగ్ బాస్ హౌజ్ ఈసారి ఎలా ఉండబోతుందన్నది అంతా ఆసక్తికరం. యాదాద్రి జిల్లా రామాయంపేట మండలం లక్ష్మాపురం గ్రామానికి చెందిన నీల నర్సింహ అనేక టీవీ ఛానళ్ళలో పనిచేసి.. తన టాలెంట్ తో దుమ్మురేపాడు. గత రెండు దశాబ్దాలుగా అనేక పాటలు, మాటల ద్వారా తెలంగాణ ప్రజల మనసుల్లో నర్సింహ నిలిచాడు.

**టాప్ న్యూస్**

### ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్



- దక్షిణ భారతదేశానికే ఛాన్స్

07

### మా భుజంపై తుపాకీ పెడతారా?



- రాహుల్ కు ఈసీ డెడ్ లైన్
- ఓట్ చోరీ పేరుతో అనుమానాలు కలిగించొద్దు
- కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ సంచలన ప్రెస్ మీట్

03

### ఈసీ వ్యాఖ్యలపై రాహుల్ సీరియస్



- మహారాష్ట్రలోనూ భారీ అక్రమాలు జరిగాయని ఫైర్
- ఓట్ అధికారయాత్ర ప్రారంభం

03

SRI GOLD
TRUSTED GOLD BUYERS

**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,01,180 |
| 22 క్యారెట్ | 92,750 |
| సిల్వర్ (కేజీ) | 1,16,200 |

# తొక్కేస్తున్నారు

## ఎన్టీఆర్ టార్గెట్‌గా కుట్రలు



ఎన్టీఆర్ ల.. అంటూ టీడీపీ ఎమ్మెల్యే బూతుపురాణం

**తెలుగు రాష్ట్రాల్లో భగ్గుమన్న ఎన్టీఆర్ ఫ్యాన్స్**

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ పై తీవ్ర ఆగ్రహం

టీడీపీ నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్

మా లోకేష్ నే.. అంటాడా అంటూ తీవ్రస్థాయిలో ఎమ్మెల్యే తిట్ల దండకం

ఎన్టీఆర్ తల్లిని కూడా అవమానించిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే

### నందమూరి ఫ్యామిలీలో కలకలం

**ఎన్టీఆర్ ను ట్రోలేస్తున్నారు.. అంటూ తెరవెనుక తతంగంపై ముందే మహా స్పెషల్ స్టోరీ**

అనంతపురం ఘటనపై చంద్రబాబు సీరియస్ .. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై ఆగ్రహం

*ఎన్టీఆర్ ను సినిమాలు కూడా చేసుకోనివ్వరా అంటూ అభిమానులు భగ్గుమంటున్నారు. ఆడదు.. అంతే అంటూ ఓ ఎమ్మెల్యే సినిమాను, సినిమా థియేటర్లను శాశించిన తీరు ఆంధ్రప్రదేశ్ లో సినిమా రాజకీయాల వైపరీత్యాలకు అద్దం పడుతుండగా, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ దారుణంగా చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ పేరుతో ఒక ఆడియో వైరల్ కావడంతో జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఓ రేంజ్ లో ఫైరవుతున్నారు. తమ హీరోను బూతులు తిడుతారా..? సినిమాను ఆపేందుకు ప్రయత్నం చేస్తారా..? అని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆ ఆడియో కాల్ పై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ రియాక్ట్ అయ్యారు. జూనియర్ ఎన్టీఆర్ ని ల..అంటూ దారుణంగా బూతులు తిట్టినట్లుగా ఆడియోలో ఉంది. వార్ 2 సినిమాని ఆడనివ్వబోనని వార్నింగ్ ఇవ్వడంతో పాటు థియేటర్ లో సినిమా ఎలా ఆడుతుందో చూస్తానంటూ హెచ్చరించారు. సినిమాకు అన్ని అనుమతులు ఉన్నా సరే ఆడనివ్వను అంటూ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు పొలిటికల్ సర్కిల్స్ లోనే కాకుండా నందమూరి ఫ్యామిలీలోనూ కలకలం రేపింది.* - మహా, నెట్ వర్క్

02



## మెట్రో రెండోదశకు త్వరలోనే అనుమతులు

**ఐటీ, ఫార్మా రంగాల్లో దూసుకుపోతున్న హైదరాబాద్**

రియల్ రంగంలోనూ ముందువరుసలో నిలుస్తాం

తెలంగాణకు అంతర్జాతీయస్థాయి రోడ్లు మంజూరు

క్రెడాయ్ ప్రాపర్టీ షోలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** మెట్రో రెండవ దశకు త్వరలోనే అనుమతులు వస్తాయని కిషన్ రెడ్డి వెల్లడించారు. హైటెక్స్ లో జరిగిన క్రెడాయ్ ప్రాపర్టీ షోలో పాల్గొన్న కి,న్ రెడ్డి మాట్లాడుతూ, దేశంలో హైదరాబాద్ నగరం ఐటీ, ఫార్మా రంగాల్లో దూసుకుపోతుందని, త్వరలోనే నిర్మాణ రంగంలో కూడా ముందువరుసలో ఉంటుందన్నారు.

మిగతా 2లో



### బెంగళూరులో ఐఫోన్ 17 తయారీ

- రూ.25వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన కొత్త ప్లాంట్
- అమెరికాలో అమ్ముడవుతున్నవి మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లేనన్న యాపిల్ సీఈఓ

03

### 23న టీపీసీసీ పీఏసీ సమావేశం



- సీఎం రేవంత్ తో భేటీలో పీసీసీ చీఫ్ మహేష్ నిర్ణయం
- స్థానిక ఎన్నికలు, సంస్థాగత నిర్మాణంపై చర్చ

02

**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ | 80,597.66 |
| నిఫ్టీ | 24,631.30 |

**ఈరోజు చికెన్ ధరలు**

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

**ఈరోజు గుడ్డు ధరలు**

ఎన్ఈసీసీ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 4.85 | 145.5 |

హోల్ సేల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 4.85 | 145.5 |

రిటైల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 5.14 | 154.23 |

### రేవంత్ ఫ్యూచర్ సిటీకి ఫ్యూచర్ లేదు



- విజన్ లేని నిర్ణయాలతో ప్రజాధనం వృథా
- ఫ్యూచర్ సిటీ పేరుతో భూములను అక్రమంగా రియల్ ఎస్టేట్‌కు మళ్లించే ప్రయత్నం
- ఫార్మాసిటీ భూముల వ్యవహారంలో ప్రభుత్వం పెద్ద భూ కుంభకోణానికి తెర లేపింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

03

### కాళేశ్వరంపై మరో కుట్ర!


**మోటర్లను నాశనం చేసేలా ప్లాన్ చేస్తున్నారు**

- ప్రభుత్వం రైతుల మీద పగ, ప్రతీకారం తీర్చుకుంది
- రైతు ప్రయోజనాల కంటే కాంగ్రెస్‌కు రాజకీయాలే ముఖ్యమా?
- బురద రాజకీయాలు మానుకోండి.. మోటర్లు ఆన్ చేసి ఆఫ్ చేయకూడదు
- ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు మండిపాటు



**సిద్దిపేట, మహా:** కాళేశ్వరం మోటర్లను నాశనం చేసే కుట్ర జరుగుతోందని మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. మోటర్లను నాశనం చేసి అది.. బీఆర్ఎస్‌పై నెపం వేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ మధ్య విభేదాలు ఉంటే మీరు మీరు చూసుకోవాలని, కాళేశ్వరంపై బురద రాజకీయాలు మానుకోండి అంటూ ఘాటు విమర్శలు చేశారు. సిద్దిపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..'రాష్ట్ర ప్రభుత్వం రైతుల మీద పగ, ప్రతీకారం తీర్చుకుంది. నీళ్లను గేట్లు ఎత్తి సముద్రంలోకి వదులుతున్నారు. కడెం ప్రాజెక్టుకు 62వేల క్యూసెక్కుల వరద వస్తోంది. నేను వారం రోజుల క్రితమే మంత్రి ఉత్తమ్ కుమార్‌కు లేఖ రాశాను.

మిగతా 2లో



### మేడిగడ్డకు రిపేర్లు కష్టమే

**ఆందోళనకరంగా మూడు బ్లాకులు..!**

- ఏడో బ్లాక్ ను పూర్తిగా కూల్చడం క్లిష్టమైన పని
- కూల్చేస్తే ఇతర బ్లాకులపై ప్రభావం పడే ప్రమాదం
- మేడిగడ్డ సహా మూడు బ్యారేజీల రిపేర్లపై ప్రభుత్వానికి ఇరిగేషన్ శాఖ లేఖ

02

manepally Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890
శ్రావణ మాసం సంబరాలు
1% V.A
Gold Chain 5.9% to 9.9% on V.A
Bangles 5.9% to 9.9% on V.A
Plain Gold Jewellery 8.9% to 11.9% on V.A
Nakshi, Polki, Kundan Jewellery 9.9% to 13.9% on V.A
Diamond ₹ 49,950/- onwards
Free Gold Coin On Diamond Purchase Above 5 cts
General Bazar 9912010888 Punjagutta 7893800555 Kukatpally 8897387888 Dilsukhnagar 6309111699 ChandaNagar 8712690020 SuchitraCircle 8712690030



# తొక్కేస్తున్నారు

ఎన్టీఆర్ ల.. అంటూ టీడీపీ ఎమ్మెల్యే బూతుపురాణం

## తెలుగు రాష్ట్రాల్లో భగ్గుమన్న ఎన్టీఆర్ ఫ్యాన్స్

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ పై తీవ్ర ఆగ్రహం

టిడిపి నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్

మా లోకేష్ నే.. అంటాడా అంటూ తీవ్రస్థాయిలో ఎమ్మెల్యే తిట్ల దండకం

ఎన్టీఆర్ తల్లిని కూడా అవమానించిన అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే

## నందమూరి ఫ్యామిలీలో కలకలం

## ఎన్టీఆర్ ను ట్రోలేస్తున్నారు.. అంటూ తెరవెనుక తతంగంపై ముందే మహా స్పెషల్ స్టోరీ

అనంతపురం ఘటనపై చంద్రబాబు సీరియస్ .. ఎమ్మెల్యే వ్యాఖ్యలపై ఆగ్రహం

(మహా నెట్ వర్క్ )

ఎన్టీఆర్ ను సినిమాలు కూడా చేసుకోనివ్వరా అంటూ అభిమానులు భగ్గుమంటున్నారు. ఆడదు.. అంతే అంటూ ఓ ఎమ్మెల్యే సినిమాను, సినిమా థియేటర్లను శాశించిన తీరు ఆంధ్రప్రదేశ్ లో సినిమా రాజకీయాల వైపరీత్యాలకు అద్దం పడుతుండగా, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ దారుణంగా చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ పేరుతో ఒక ఆడియో వైరల్ కావడంతో జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఓ రేంజ్ లో ఫైరవుతున్నారు. తమ హీరోను బూతులు తిడుతారా..? సినిమాను ఆపేందుకు ప్రయత్నం చేస్తారా..? అని తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆ ఆడియో కాల్ పై ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ రియాక్ట్ అయ్యారు. జూనియర్ ఎన్టీఆర్ ని ల..అంటూ దారుణంగా బూతులు తిట్టినట్లుగా ఆడియోలో ఉంది. వార్ 2 సినిమాని ఆడనివ్వబోనని వార్నింగ్ ఇవ్వడంతో పాటు థియేటర్ లో సినిమా ఎలా ఆడుతుందో చూస్తానంటూ హెచ్చరించారు. సినిమాకు అన్ని అనుమతులు ఉన్నా సరే ఆడనివ్వను అంటూ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు పొలిటికల్ సర్కిల్స్ లోనే కాకుండా నందమూరి ఫ్యామిలీలోనూ కలకలం రేపింది. ముందునుండీ కొందరు టిడిపి నేతలు తాము ఎన్టీఆర్ ను తిడితే మంత్రి లోకేష్ మెప్పు పొందవచ్చన్న ఆశతో కుట్రలకు తెరతీయగా, ఈ వ్యవహారంపై టీడీపీ హైకమాండ్ కూడా తీవ్ర ఆగ్రహంగా ఉన్నట్లు తెలుస్తోంది. సినిమా రిలీజ్ కు ముందునుండే కొందరు కిందిస్థాయి నేతలు పార్టీ ఇమేజ్ కు డ్యామేజ్ కలిగేలా అత్యుత్సాహం ప్రదర్శించడంతో విపరీతమైన ట్రోల్స్ చేశారు. దీనిపై ట్రోలేస్తున్నారు అంటూ ఎన్టీఆర్ వార్ 2 మీద జరుగుతున్న కుట్రలపై మహా పత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితం కాగా, ఇది సంచలనమైంది. టీడీపీ క్యాడర్ , ఉన్నత స్థాయి నేతలు కూడా ఈ వ్యవహారంపై అసంతృప్తిగా ఉన్నారు.

**భగ్గుమన్న ఫ్యాన్స్**


టీడీపీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలపై ఎన్టీఆర్ ఫ్యాన్స్ భగ్గుమన్నారు. అనంతపురం, విజయవాడతో పాటు ఏపీలోని పలు జిల్లాల్లో నిరసనలకు దిగారు. ఎమ్మెల్యే బయటకు వచ్చి క్షమాపణలు చెప్పాలని, ఎమ్మెల్యేను టిడిపి నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తామంతా టిడిపికే పనిచేశామని, తాము నందమూరి అభిమానులమని అన్నారు. ఆయన సినిమాలు చేసుకుంటుంటే రాజకీయాల్లోకి ఎందుకు లాగుతున్నారని ఫైరయ్యారు.

**అనంతపురం ఎమ్మెల్యే తీరుపై చంద్రబాబు సీరియస్**

అనంతపురం ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలు పార్టీ ఇమేజ్ కి తీవ్ర నష్టం చేస్తాయని సీఎం అభిప్రాయపడ్డారని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. చిన్నపాటి విమర్శలు కూడా ప్రతిపక్షానికి ఆయుధాలుగా మారుతాయని గుర్తుచేశారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా క్రమశిక్షణా చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. సంబంధిత ఘటనలో తప్పు లేకపోయినా.. తప్పుడు ప్రచారం జరుగుతుంటే వెంటనే బయటకు వచ్చి ప్రజలకు వాస్తవాలు చెప్పాల్సిన అవసరం ఉందని నేతలకు సీఎం చంద్రబాబు సూచించారు.

**స్పందించిన అనంతపురం ఎమ్మెల్యే**

సోషల్ మీడియాలో తన పేరుతో వైరల్ అవుతున్న వివాదాస్పద ఆడియో క్లిప్‌పై అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ స్పందించారు. సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌ను దూషిస్తున్నట్లుగా ఉన్న ఆ ఆడియోతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన తేల్చిచెప్పారు. అది తన గొంతు కాదని, స్థానిక



రాజకీయాల్లో తనపై గిట్టనివారే ఇలాంటి దుష్ప్రచారానికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. ఈ ఆడియో వల్ల జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల మనోభావాలు దెబ్బతిని ఉంటే, తన తరఫున మనస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నానని ఆయన వినమ్రంగా తెలిపారు. ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని ఆయన కోరారు.

**ఇవేమైనా ఈవీఎంలా.. రోజా ఫైర్**

"ఇవేమైనా ఈవీఎంలు అనుకున్నారా... మార్చివేసి మోసం చేయడానికి! సినిమాలు ఆడనివ్వబోమని హెచ్చరించడానికి వీళ్లెవరు? పెద్ద ఎన్టీఆర్ అభిమానులు, చిన్న ఎన్టీఆర్ అభిమానులు అందరూ కూడా చిన్న ఎన్టీఆర్ సినిమాలు చూస్తారు. వీళ్లు చిన్న ఎన్టీఆర్ సినిమాలు ఆపేస్తాం అని బెదిరించడం చూస్తుంటే, అరచేతిని అడ్డంపెట్టి సూర్యుడ్ని ఆపేస్తాం అన్నంత హాస్యాస్పదంగా ఉంది. అంటూ మాజీ మంత్రి రోజా ఫైర్ అయ్యారు. సినిమా బాగుంటే ఎవరూ ఏం చేయలేరు, ఎవరూ అడ్డుకోలేరు. సినిమా బాగాలేకపోతే ఎవరూ ఆడించలేరు. హరిహర వీరమల్లు విషయంలో ఏం జరిగిందో అందరికీ తెలుసు. ఎమ్మెల్యేలు తలకిందులుగా తపస్సులు చేసి, టికెట్లు ఫ్రీగా ఇస్తే కూడా వాళ్ల అభిమానులే థియేటర్లకు రాలేక ఏడుస్తూ ఆ సినిమాను ఎలా తిట్టారో మనం కళ్లారా చూశాం. ఇప్పటికైనా వాళ్లు తెలుసుకోవాల్సింది... రాజకీయాలు రాజకీయల్లా చేయండి. సినిమాల విషయం సినిమావాళ్లు చూసుకుంటారు. సినిమా ఫంక్షన్లలో జగన్ ను తిట్టడం, సవాళ్లు విసరడం చేస్తే... గేమ్ చేంజర్, హరిహరవీరమల్లు వంటి సినిమాలు ఏమయ్యాయో మనం కళ్లారా చూశాం. కాబట్టి, సినిమాను రాజకీయాన్ని మిక్స్ చేయొద్దు. జూనియర్ ఎన్టీఆర్ రాజకీయాల్లో లేరు... ఆయన సినిమాలు చేసుకుంటున్నారు. ఆయన సినిమాలు ఎలా హిట్టవుతున్నాయి, ఆయన పెర్ఫార్మెన్స్ కు ఇంటర్నేషనల్ లెవల్లో ఏ విధంగా అవార్డులు వస్తున్నాయి అనేది మనం చూస్తూనే ఉన్నాం. కానీ, మైక్ లు ఉన్నాయని, పచ్చ చానళ్లు ఉన్నాయని, తాము ఏం చెప్పినా వేస్తారని అనుకుంటే... చూసే జనం నవ్వుతారు" అంటూ రోజా పేర్కొన్నారు.

# మెట్రో రెండోదశకు త్వరలోనే అనుమతులు

## ఐటీ, ఫార్మా రంగాల్లో దూసుకుపోతున్న హైదరాబాద్

రియల్ రంగంలోనూ ముందువరుసలో నిలుస్తాం

తెలంగాణకు అంతర్జాతీయస్థాయి రోడ్లు మంజూరు

క్రెడాయ్ ప్రాపర్టీ షోలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి )

ప్రపంచంలో వస్తున్న మార్పుల దృష్ట్యా భారత్ లోని నిర్మాణ రంగంలో స్వదేశీ వస్తువులనే ఉపయోగించాలని నిర్మాణ సంస్థలకు కిషన్ రెడ్డి పిలుపు నిచ్చారు. రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల సహాయసహకారాలు అందిస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణకు అంతర్జాతీయస్థాయి రోడ్లను మంజూరు చేశామని, వరంగల్ కు మామునూరు ఎయిర్ పోర్టు, ఆదిలాబాద్ లో ఉన్న డిఫెన్స్ ఎయిర్ పోర్టును సివిల్ ఎయిర్ పోర్టుగా మార్చామన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ను రూ.70 కోట్లతో ఆధునీకరిస్తున్నామని అన్నారు. ఎంఎంటీఎస్ రైళ్లను ఏసీ రైళ్లుగా మారుస్తామని పేర్కొన్నారు.

**సొంత ఇల్లు ఒక ఎమోషన్**

ఇవాళ భారతదేశంలో ఒక సొంతిల్లు ఉండటమనేది కేవలం ఒక కోరికనో, ఓ కలనో మాత్రమే కాదు. ఇదొక ఎమోషనల్ అవసరంగా మారిందని కిషన్ రెడ్డి అన్నారు. అందుకే సొంతింటి కల నెరవేర్చుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషిచేస్తుంటారన్నారు. వినియోగదారుల ప్రయోజనాలను, రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని సమన్వయం చేసే ఉద్దేశంతో.. 2016లో రెరా (రియల్ ఎస్టేట్ రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్ యాక్ట్)ను కేంద్రం తీసుకొచ్చిందన్నారు. జీవితాంతం కష్టపడి సంపాదించిన మొత్తాన్ని వెచ్చించి తమ సొంతింటి కలను నెరవేర్చుకోవాలని చూస్తారని, అలాంటప్పుడు వారి ఆకాంక్షలను నెరవేర్చాలని, వారి హక్కును వారికి ఇబ్బందుల్లేకుండా అందించాలనేది ప్రధాన మంత్రి మోదీ ఆలోచన అని తెలిపారు. చాలా ఏళ్ల తర్వాత 2024లో తెలంగాణ ప్రభుత్వం.. రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించి.. ఓ శాశ్వత నియంత్రణ వ్యవస్థను, ఓ అప్పిలేట్ ట్రిబ్యునల్ ను ఏర్పాటు చేయడం చాలా సంతోషమన్నారు. తెలంగాణలో దాదాపు 10వేల ప్రాజెక్టులు, 4వేల మంది ఏజెంట్లు రెరాలో రిజిస్టర్ అయ్యారని, గత 11 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎకనమిక్ పాలసీలు, ప్రోసీజర్ల కారణంగా మధ్యతరగతి తోపాటుగా రియల్



ఎస్టేట్ రంగానికి చాలా మేలు జరిగిందని పేర్కొన్నారు. ఈ 11 ఏళ్ల నిర్ణయాల కారణంగా.. 20 కోట్ల మంది అత్యంత పేదరికం నుంచి బయటకు వచ్చారని వివరించారు. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచడంతోపాటుగా ఆర్ బీఐ వడ్డీ రేట్లను తగ్గించడం ద్వారా హోమ్ లోన్ ఈఎంఐలు చెల్లించడం కూడా సులభమైందన్నారు. ఇలాంటి ఎన్నో నిర్ణయాలు.. అటు మధ్యతరగతిని, ఇటు రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించేవిగా ఉన్నాయన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాన మంత్రి జీఎస్ టీ శ్లాబ్స్ ను తగ్గించబోతున్నట్లు ప్రకటించారని తద్వారా వస్తువులు, సేవలపై పన్నులు మరింత తగ్గుతాయన్నారు. దీంతో కామన్ మ్యాన్ డబ్బు మరింత ఆదా అవుతుందన్నారు. ఇవాళ భారతదేశం 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతంగా నిలిచేందుకు.. 35 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకుందని వివరించారు.

# కాళేశ్వరంపై మరో కుట్ర!



(మొదటిపేజీ తరువాయి )

సీఎం రేవంత్, ఉత్తమ్ కుమార్‌కు నీళ్ల విలువ తెలియదు. ప్రభుత్వం నడపడం చేతకావడం లేదు.. ఎందుకు ప్రాజెక్టుల నీళ్లను వృథా చేస్తున్నారు.

**నీళ్లను ఒడిసి పట్టండి..**

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రాష్ట్ర రైతాంగానికి నష్టం కలుగుతున్నది. ఉన్న వ్యవస్థను నడపడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదా..? కమీషన్లకు, వాటాలు పంచుకోవడానికి సమయం సరిపోతలేదా..? రైతు ప్రయోజనాల కంటే రాజకీయాలే ముఖ్యమా ? నంది మేడారంలో ఖటక ఒత్తితే రోజుకి రెండు టీఎంసీల నీళ్లు వచ్చి మిడ్ మానేరులో పడతాయి. వారం రోజుల కిందనే ఈ విషయాన్ని ఉత్తంకుమార్ రెడ్డికి తెలుపుతూ ఉత్తరం రాశాను. అన్నపూర్ణ రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లు ఖాళీగా ఉన్నాయి. చెరువులన్నీ ఖాళీగా ఉన్నాయి. నీళ్లను ఒడిసి పట్టండి. వెంటనే మోటర్లు ఆన్ చేయండి అని ప్రభుత్వానికి విన్నపం చేశాను. దురదృష్టం ప్రభుత్వం మోటర్లు ఆన్ చేయలేదు. ఇప్పుడు ఎల్లంపల్లి గేట్లెత్తి నీళ్లను సముద్రంలోకి వదులుతున్నారు అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఎందుకు నీళ్లను సముద్రం పాలు చేస్తున్నారు. ఎస్ఆర్ఎస్పీ వరద కాలువ ద్వారా అన్నపూర్ణ, మిడ్ మానేరు, ప్రాజెక్టును నింపాలి. వేలాది మంది రైతులతో వెళ్లి మేమే మోటార్లు ఆన్ చేస్తాం. మీరు ఆన్ చేయకుంటే మేమే ఆన్ చేస్తాం. కాళేశ్వరంపై మరో కుట్ర చేస్తున్నారు.. మోటర్లను ఆన్ అండ్ ఆన్ చేయడం వలన మోటార్లు పనికి రాకుండా చేస్తున్నారు. కాళేశ్వరంపై బురద రాజకీయాలు మానుకోండి. ఆన్ చేసి ఆఫ్ చేయకూడదని బీహెచ్ఈఎల్ ఇప్పటికే హెచ్చరించింది. మోటర్లను నాశనం చేసి.. అది బీఆర్ఎస్‌పై వేయాలని కుట్ర చేస్తున్నారు. మీ మధ్య ఏమైనా విభేదాలు ఉంటే మీరే చూసుకోండి. దేవాదుల మోటార్లు ఆన్ చేయక వరంగల్‌కు నష్టం జరుగుతోంది. కమీషన్ పంచుకోవడానికి సమయం సరిపోవడం లేదు' అని విమర్శలు చేశారు.





# 23న టీపీసీసీ పీఏసీ సమావేశం

బీసీ రిజర్వేషన్లు, స్థానిక ఎన్నికలు, పార్టీ సంస్థాగత నిర్మాణం అంశాలపై చర్చ

హాజరుకానున్న పీసీసీ చీఫ్, కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్, సీఎం, మంత్రులు

జూబ్లీహిల్స్ సీఎం నివాసంలో రేవంత్ రెడ్డితో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ భేటీ

**హైదరాబాద్, మహా:** ఈ నెల 23న టీపీసీసీ పీఏసీ సమావేశం జరగనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. ఆదివారం ఉదయం జూబ్లీహిల్స్ సీఎం నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ హనుమంతరావు తదితర నేతలు హాజరయ్యారు. అనంతరం పీఏసీ సమావేశంపై ప్రకటన చేశారు. కాగా బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ సంస్థాగత నిర్మాణం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ నెల 23 వ తేదీన సాయంత్రం 5 గంటలకు గాంధీ భవన్‌లో టీపీసీసీ పీఏసీ సమావేశం ఉంటున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 23వ తేదీన సాయంత్రం 5 గంటలకు గాంధీ భవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశం ఉండనుంది. బీసీ రిజర్వేషన్లు, స్థానిక సంస్థల ఎన్నికలు, పార్టీ సంస్థాగత నిర్మాణం తదితర అంశాలపై సుదీర్ఘంగా నాయకులు చర్చించనున్నారు.

# బెంగళూరులో ఐఫోన్ 17 తయారీ

## రూ.25 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటైన కొత్త ప్లాంట్


అమెరికాలో అమ్ముడవుతున్నవి మేడ్ ఇన్ ఇండియా ఐఫోన్లేనన్న యాపిల్ సీఈఓ

**మహా:** టెక్నాలజీ దిగ్గజం యాపిల్ ప్రధాన సరఫరాదారు, తైవాన్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ సంస్థ ఫాక్స్‌కాన్, బెంగళూరులో కొత్తగా నిర్మించిన ఫ్యాక్టరీలో ఐఫోన్ 17 మోడళ్ల తయారీని ప్రారంభించింది. ఈ పరిణామం భారత్‌ను గ్లోబల్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా నిలబెట్టే ప్రయత్నాలకు మరింత ఊతమిస్తోంది. బెంగళూరు దేవనహళ్లిలో సుమారు రూ. 25వేల కోట్ల (2.8 బిలియన్ డాలర్లు) భారీ పెట్టుబడితో ఫాక్స్‌కాన్ ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. చైనా వెలుపల ఫాక్స్‌కాన్‌కు ఇదే రెండో అతిపెద్ద ఐఫోన్ తయారీ యూనిట్ కావడం విశేషం. ఇప్పటికే చెన్నైలోని ప్లాంట్‌లో ఐఫోన్ 17 తయారీ జరుగుతుండగా, ఇప్పుడు బెంగళూరు యూనిట్ కూడా జత కలిసింది. గతేడాది ఐఫోన్ 16 సిరీస్‌ను కూడా ఇదే తరహాలో గ్లోబల్ లాంచ్‌కు ముందే భారత్‌లో ఉత్పత్తి చేసిన సంగతి తెలిసిందే. భారత్‌లో ఐఫోన్ల తయారీని యాపిల్ వేగవంతం చేసింది. 2024 25లో 3540 మిలియన్ యూనిట్లను ఉత్పత్తి చేయగా, ఈ ఏడాది దానిని 60 మిలియన్ యూనిట్లకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో (2025 మార్చి 31 నాటికి) భారత్‌లో యాపిల్ సుమారు 22 బిలియన్ డాలర్ల విలువైన ఐఫోన్లను అసెంబుల్ చేసింది. యాపిల్ గ్లోబల్ సప్లై చైన్‌లో భారత్ ప్రాధాన్యత విపరీతంగా పెరుగుతోందని కంపెనీ సీఈఓ టిమ్ కుక్ ఇటీవలే స్పష్టం చేశారు. జూన్ లో అమెరికాలో విక్రయించిన మెజారిటీ ఐఫోన్లు భారత్‌లోనే తయారైనవని ఆయన వెల్లడించడం తెలిసిందే.

# మేడిగడ్డకు రిపేర్లు కష్టమే

## ఆందోళనకరంగా మూడు బ్లాకులు..!

- ఏడో బ్లాక్ ను పూర్తిగా కూల్చడం క్లిష్టమైన పని
- కూల్చేస్తే ఇతర బ్లాకులపై ప్రభావం పడే ప్రమాదం
- మేడిగడ్డ సహా 3 బ్యారేజీల రిపేర్లపై ప్రభుత్వానికి ఇరిగేషన్ శాఖ లేఖ



**హైదరాబాద్, మహా :** కాళేశ్వరం ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మేడిగడ్డ బ్యారేజీకి రిపేర్లు చేయడం కష్టమేనా? ఒకవేళ చేసినా ఎక్కువ టైమ్ పడుతుందా? బ్యారేజీలోని ఇతర బ్లాకుల్లోనూ లోపాలున్నాయా? అంటే అవుననే సమాధానాలే వస్తున్నాయి. మేడిగడ్డ బ్యారేజీకి రిపేర్లు చేయడమే ఇప్పుడు ఇరిగేషన్ శాఖ అధికారులకు అతిపెద్ద సవాల్ గా మారింది. ఏం ముట్టుకుంటే ఏమవుతుందోనన్న ఆందోళన అధికారులను వెంటాడుతున్నది. బ్యారేజీలోని ఏడో బ్లాక్ 2023 అక్టోబర్ 21న కుంగిపోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ఇప్పటికే విజిలెన్స్, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ), కాళేశ్వరం జ్యుడీషియల్ కమిషన్లు రిపోర్టులను సమర్పించాయి. ఎన్డీఎస్ఏ రిపోర్టు ఏడో బ్లాక్ ను పూర్తిగా కూల్చేసి కట్టడమే నయమని తేల్చి చెప్పింది. రిపేర్లు చేసుకోవచ్చుగానీ.. అత్యంత పకడ్బందీగా చేయాలని, కొంచెం తేడా వచ్చినా నష్టం తప్పదని హెచ్చరికలు చేసింది. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు దానికి రిపేర్లు చేయడం అతికష్టమని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది.

ఏడో బ్లాక్ ను పూర్తిగా కూల్చేసి కట్టడం అత్యంత క్లిష్టమైన పని అని అధికారులు అంటున్నారు. ఆ బ్లాక్ ను కూల్చాలని ప్రయత్నిస్తే ఇతర బ్లాకులపైనా ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూల్చకుండా రిపేర్లు ఎలా చేయాలన్న దానిపై తర్జనభర్జనలు పడుతున్నట్టు తెలిసింది. ఒకవేళ రిపేర్లు చేయాల్సి వస్తే అది రెండు మూడు నెలల్లో అయ్యేది కాదని, రెండేండ్లైనా పడుతుందని అంటున్నారు. దీంతో కూల్చి కొత్తది కట్టడమా.. కుంగిన దానికి రిపేర్లు చేయడమా అన్న విషయంలో నీటి పారుదల శాఖ డైలమాలో పడినట్టు తెలుస్తున్నది.

**మరికొన్ని బ్లాకుల్లోనూ లోపాలు**

బ్యారేజీలోని ఏడో బ్లాక్ ఒక్కటే కాదు.. ఇతర బ్లాకుల్లోనూ లోపాలున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిహాబిలిటేషన్ డిజైన్ల కోసం అక్కడ టెస్టులు చేసేందుకు ఇటీవల పుణేలోని సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) నిపుణులు అక్కడ ప్రాథమిక పరిశీలన చేసి వెళ్లారు. అయితే, అక్కడి పరిస్థితుల ప్రకారం చూస్తుంటే ఏడో బ్లాక్లోనే కాకుండా మరికొన్ని బ్లాకుల్లోనూ సమస్యలున్నట్టుగా అంచనా వేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలోనే అన్ని బ్లాకులపైనా సమగ్రంగా స్టడీ చేయించాలని ఇరిగేషన్ శాఖ అధికారులు నిర్ణయించారని సమాచారం. మేడిగడ్డనే కాకుండా.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లోనూ ప్రతి బ్లాకు వద్దా జియోటెక్నికల్ ఇన్వెస్టిగేషన్స్ చేయించాలని యోచిస్తున్నట్టు తెలుస్తున్నది.

**ప్రభుత్వానికి లేఖ**

మేడిగడ్డతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల విషయంలో ఏం చేయాలి.. ఎలా ముందుకు పోవాలన్న దానిపై ప్రభుత్వానికి ఇరిగేషన్ శాఖ లేఖ రాసినట్టు తెలుస్తున్నది. బ్యారేజీలకు రిహాబిలిటేషన్ డిజైన్లకు సంబంధించి డిపార్ట్మెంట్ కు చెందిన సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ బాధ్యత వహించాలని ఇటీవలి సమావేశంలోమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే సీడీవో నేతృత్వంలోనే డిజైన్లు చేయించాలని భావిస్తున్న ఇరిగేషన్ శాఖ దేశంలోని ప్రముఖ సంస్థల నుంచి రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్స్ స్వీకరించాలని నిర్ణయించింది. ఆయా సంస్థల నుంచే బ్యారేజీలకు ఓ డిజైనర్ కన్సల్టెంట్ ను నియమించాలని భావిస్తున్నది. దాంతో పాటు బ్యారేజీల రిపేర్లు, టెస్టులు తదితర అంశాలతో ప్రభుత్వానికి సవివరంగా ఇరిగేషన్ శాఖ లేఖ రాసిందని సమాచారం.

**ఆందోళనకరంగా మూడు బ్లాకులు**

బ్యారేజీ ఫౌండేషన్ అయిన సీకెంట్ పైల్స్ వ్యవస్థలో ఇసుకతో నింపిన సంగతి తెలిసిందే. అయితే ఆ ఫౌండేషన్ వ్యవస్థలోని ఇసుక కింద ఐదు మీటర్ల వరకు నీళ్లున్నట్టుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే మరికొన్ని బ్లాకుల్లోనూ సీపేజీ ఏమైనా ఉండి ఉంటుందా అని నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఓ మూడు బ్లాకుల పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టుగా చెబుతున్నారు. వాటి పరిస్థితి తేలాలంటే ఇప్పుడు అక్కడ జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్స్ చేయాల్సి ఉంటుందని, కానీ అక్కడ బోర్ వెల్స్ వేసే పరిస్థితులు కూడా లేవని చెబుతున్నారు. ప్రస్తుతం వచ్చిన వరదను వచ్చినట్టే దిగువకు వదిలేస్తున్నా.. ఫౌండేషన్లో మాత్రం నీటి ఆనవాళ్లున్నాయన్న ఆందోళన వ్యక్తమవుతున్నది. సీడబ్ల్యూపీఆర్ఎస్ అక్కడ టెస్టులు చేయాలన్నా ఆ నీళ్లు పూర్తిగా పోవాల్సిందేనని, దానికి డిసెంబర్ దాకా సమయం పట్టే అవకాశం ఉందంటున్నారు.

# రేవంత్ ఫ్యూచర్ సిటీకి ఫ్యూచర్ లేదు

## విజన్ లేని నిర్ణయాలతో ప్రజాధనం వృథా

- ఫ్యూచర్ సిటీ పేరుతో భూములను అక్రమంగా రియల్ ఎస్టేట్‌కు మళ్లించే ప్రయత్నం
- ఫార్మాసిటీ భూముల వ్యవహారంలో ప్రభుత్వం పెద్ద భూ కుంభకోణానికి తెర లేపింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్, మహా:** నగరంలోని ఫార్మాసిటీ భూములలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్ష నెరవేరదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఫార్మాసిటీ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి చెప్పిన ఫ్యూచర్ సిటీకి భవిష్యత్తు లేదని కేటీఆర్ విమర్శించారు. రేవంత్ తన అవివేకంతో.. గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దు చేశారని మండిపడ్డారు. దాని స్థానంలో అవాస్తవ ప్రాజెక్ట్ అయిన ఫ్యూచర్ సిటీని ప్రవేశపెట్టారని ఆయన ధ్వజమెత్తారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం, ఒక నిర్దిష్ట ప్రజా ప్రయోజనం కోసం సేకరించిన భూమిని ఇతరుల ప్రయోజనం కోసం రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు మళ్లించడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో 56 గ్రామాల పరిధిలో హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం 20వేల ఎకరాలతో ప్రతిపాదనలను తయారుచేశామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి రైతులు ముందుకు వచ్చి తమ భూములను ఫార్మాసిటీ కోసం ఇచ్చారని పేర్కొన్నారు. ఇప్పుడు రైతన్నలు ఫార్మా కంపెనీలకు కేటాయించిన భూముల భవితవ్యంపై సందిగ్ధతలో ఉన్నారని చెప్పుకొచ్చారు. అభివృద్ధి పేరిట అప్పట్లో ఇచ్చిన ఆ భూములు ఇప్పుడు వృథాగా మారినట్టు కనిపిస్తుండటం వారి ఆశల్ని ఆవిరిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలకు, రైతులకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**పెద్ద భూ కుంభకోణానికి తెర లేపింది..**

ఫార్మాసిటీ భూముల వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద భూ కుంభకోణానికి తెర లేపిందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలను మోసం చేసే ఏ ప్రయత్నాన్నైనా బీఆర్ఎస్ తరఫున అడ్డుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు. కొంతమంది తమ భూములు ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తే కాంగ్రెస్ మాత్రం అధికారంలోకి రాగానే హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం సేకరించిన ప్రతి ఎకరాన్ని తిరిగి రైతన్నలకు ఇస్తామని హామీలు ఇచ్చి, ఇప్పుడు రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు స్నేహితుల కోసం అవే భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ వారిని నిండా మోసం చేసిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతన్నలు ఫార్మా కంపెనీల కోసం కేటాయించిన భూముల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని పేర్కొన్నారు. ఫార్మాసిటీ ప్రాజెక్టు కోసం గత ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనంతో మౌలిక వసతుల కల్పనను ప్రారంభించినా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం దానిని పక్కనపెట్టి, ఇప్పుడు ఫ్యూచర్ సిటీ పేరుతో భూములను అక్రమంగా రియల్ ఎస్టేట్‌కు మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ చర్యలు ప్రజా ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని, దాంతో ప్రజలు, ముఖ్యంగా రైతులు నష్టపోతారని కేటీఆర్ హెచ్చరించారు. ఈ మొత్తం వ్యవహారంపై ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలకు, రైతులకు స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో, బీఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుందని హెచ్చరించారు.

# బనకచర్ల ప్రాజెక్టుపై తేల్చాల్సింది కేంద్రమే..

### మిగులు జలాల వాటాలు తేలాకే కొత్త ప్రాజెక్టులు కట్టాలని స్పష్టీకరణ

### విశాఖలో కాంగ్రెస్ 'ఓట్ల చోరీ' నిరసనలో పాల్గొన్న తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి



**విశాఖపట్టణం, మహా :** గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్మించాలనుకుంటున్న గోదావరిబనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక వ్యాఖ్యలు చేశారు. మిగులు జలాల్లో తెలుగు రాష్ట్రాల వాటాలు తేలిన తర్వాతే గోదావరిపై ఎలాంటి కొత్త ప్రాజెక్టులు నిర్మించినా అది చట్టబద్ధంగా, న్యాయంగా ఉంటుందని స్పష్టం చేశారు. నీటి వాటాలను నిర్ధారించాల్సిన పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని ఆయన పేర్కొన్నారు. 'ఓట్ల చోరీ' నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖపట్నం వచ్చిన భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. ఏపీ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుపై అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందించారు. నదీ జలాల కోసమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తు చేశారు. ప్రస్తుతం తమ రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు పూర్తయి, నీటి కేటాయింపులు జరిగిన తర్వాతే మిగులు జలాల అంశంపై ఒక స్పష్టత వస్తుందని ఆయన వివరించారు. ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్, దేవాదుల వంటి గోదావరిపై మేం చేపట్టిన ప్రాజెక్టులు పూర్తి కాలేదని.. మా ప్రాజెక్టుల నిర్మాణం తర్వాత వాటాలు తేల్చి మిగిలిన వాటిని సమృద్ధి గా వాడుకోవచ్చని ఆయన అన్నారు. అయితే, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టును గట్టిగా సమర్థించారు. పోలవరం నుంచి వృథాగా సముద్రంలోకి పోయే గోదావరి వరద నీటిని బనకచర్లకు తరలించి రాయలసీమను అభివృద్ధి చేయాలనేది తమ లక్ష్యమని చెప్పారు. దిగువ రాష్ట్రంగా వరదల వల్ల తాము నష్టపోతున్నామని, అలాంటి వరద నీటిని వాడుకుంటామంటే అభ్యంతరాలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుతో ఏ రాష్ట్ర ప్రయోజనాలకు నష్టం జరగదని భరోసా ఇచ్చారు. తెలంగాణ కాంగ్రెస్‌లో విభేదాల గురించి అడిగిన ప్రశ్నకు సమాధానంగా భట్టి.. తెలంగాణ కాంగ్రెస్‌లో అసమ్మతి లేదని వ్యాఖ్యానించారు. పార్టీ బలంగా ఉండాలని రాజగోపాల్‌రెడ్డి కూడా కోరుతున్నారని భట్టి చెప్పుకొచ్చారు. భవిష్యత్‌లో ఏపీలో కూడా కాంగ్రెస్ బలపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చంద్రబాబు, రేవంత్, రాహుల్ గురించి వైఎస్ జగన్ హాట్ లైన్ వ్యాఖ్యలపై స్పందించిన భట్టి.. అవి వ్యక్తిగతమైన రాజకీయ ఆరోపణలు అని చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా పార్టీ విధానాలు విశాలమైన ప్రయోజనాలతో ఉంటాయి తప్ప సంకుచితమైన మనస్తత్వంతో ఉండవన్నారు.

**'ఓట్ల చోరీ' నిరసనలో పాల్గొన్న భట్టి**

ఇదే పర్యటనలో, భట్టి విక్రమార్క ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'ఓట్ల చోరీ' నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడం పౌర హక్కులను కాలరాయడమేనని ఆయన అన్నారు. అర్హులైన ఓటర్లను తొలగించి, బోగస్ ఓట్లను చేర్చడం ద్వారా బీజేపీ లబ్ధి పొందిందని ఆరోపించారు. ఈ విషయంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధారాలతో సహా మోదీ ప్రభుత్వాన్ని నిలదీశారని గుర్తుచేశారు. అయినప్పటికీ, ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన విమర్శించారు.

# ఈసీ వ్యాఖ్యలపై రాహుల్ సీరియస్

### మహారాష్ట్రలోనూ భారీ అక్రమాలు జరిగాయని ఫైర్

### ఓట్ అధికారయాత్ర ప్రారంభం



**మహా:** సీఈసీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సీరియస్ అయ్యారు. ఈసీ నన్ను అఫిడవిట్ అడగటం కంటే ముందు నాలాంటి ఆరోపణలు నాకంటే ముందే చేసిన బీజేపీ నేత అనురాగ్ ఠాకూర్‌ను ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. మహారాష్ట్ర ఎన్నికలను ఎన్డీఏ క్లీన్ స్వీప్ చేయగా.. ఆ ఫలితాలపై కూడా తాము రీసెర్చ్ చేశామని, దాన్లో 4 నెలల్లో ఈసీ కోటి ఓట్లు చేర్చినట్టు గుర్తించామన్నారు. లోక్ సభ, అసెంబ్లీ ఎన్నికల్లో మాకు వచ్చిన ఓట్లలో ఏమీ తేడా లేదన్నారు. కానీ కొత్తగా చేర్చిన కోటి ఓట్ల వల్లనే ఎన్డీఏ గెలిచిందని ఆరోపించారు.

**ఎన్నికల సంఘం ప్రక్షాళన అత్యంత అవసరం : కేటీఆర్**

హైదరాబాద్, మహా : భారత ఎన్నికల సంఘం తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే. తారక రామారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్) అవసరంతో పాటు ఎన్నికల సంఘానికే సమగ్ర ప్రక్షాళన అవసరమని కేటీఆర్ అన్నారు. ఆదివారం ఎలక్షన్ కమిషన్ నిర్వహించిన పత్రిక సమావేశంపై కేటీఆర్ స్పందించారు. "ఎన్నికల సంఘం నిర్వహించిన మీడియా సమావేశం చూస్తే, సమాధానాల కన్నా ప్రశ్నలే ఎక్కువగా మిగిలాయన్నారు. దీనిపై ఎన్నికల ప్రధాన కమిషనర్ ఇచ్చిన వివరణలో, సమస్యల పరిష్కారాల కన్నా సాకులుగా ఎక్కువగా కనిపిస్తున్నాయని కేటీఆర్ విమర్శించారు. ప్రజాస్వామ్య ప్రక్రియను కాపాడాల్సిన ఎన్నికల సంఘం, అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వానికి ఒక అనుబంధ విభాగంలా పనిచేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఓటర్ల జాబితాలో లోపాలను ఈసీఐ అంగీకరించినప్పుడు, తమ విధులను నిర్లక్ష్యం చేసినట్లు కూడా ఒప్పుకోవాల్సిన అవసరం లేదా? కేటీఆర్ ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో, కేవలం ఓటర్ల జాబితాను సవరించడం కాకుండా, ఈసీఐ నియామక ప్రక్రియనే సమూలంగా మార్చాల్సిన సమయం ఆసన్నమైందని కేటీఆర్ అన్నారు. మన దేశాన్ని ఇప్పటికీ ప్రజాస్వామ్య దేశంగా పిలుచుకోవాలంటే, ఈ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### గాంధీ జయంతి నాటికి అందుబాటులోకి

# లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలు

### రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి నాటికి అందుబాటులోకి తీసుకువస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి మొదటి విడత సర్వేయర్ల శిక్షణ పూర్తయిందని రెండవ విడత శిక్షణ 23 జిల్లా కేంద్రాల్లో ఈనెల 18వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. లైసెన్స్‌డ్ సర్వేయర్ల నియామకం పై ఆదివారం అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూభారతి చట్టంలో రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఇందుకు అవసరమైన లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను గాంధీ జయంతి రోజునాటికి అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి మే 26 నుంచి జూలై 26 వరకు 50 పనిదినాల్లో ఆయా జిల్లా కేంద్రాల్లో ఏడు వేల మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని, గత నెల 28, 29 తేదీల్లో జెఎన్‌టియు ఆధ్వర్యంలో ల్యాబ్ ప్రాక్టికల్ పరీక్ష నిర్వహించి ఫలితాలు ప్రకటించామని తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు 40 రోజుల పాటు అప్రెంటిస్ శిక్షణను కూడా ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ శిక్షణ పూర్తయిన వెంటనే వీరికి లైసెన్స్ జారీ చేయనున్నట్లు వెల్లడించారు. వీరి సేవలను పారదర్శకంగా నిర్వహించడానికి వీలుగా సర్వే మాన్యువల్ ను రూపొందించాలని అధికారులకు సూచించారు. రెవెన్యూ, సర్వే విభాగానికి మధ్య అవినాభావ సంబంధం ఉందని సర్వే విభాగం బలోపేతంతోనే రెవెన్యూ వ్యవస్థలో మెరుగైన సేవలు అందించగలుగుతామని , దీనిని దృష్టిలో పెట్టుకొని సర్వేవిభాగాన్ని బలోపేతం చేస్తున్నామని తెలిపారు. గత పదేళ్ళలో సర్వే విభాగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందన్నారు.

# మా భుజంపై తుపాకీ పెడతారా?

## రాహుల్‌కు ఈసీ డెడ్ లైన్

### ఓట్ చోరీ పేరుతో అనుమానాలు కలిగించొద్దు

### కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ సంచలన ప్రెస్ మీట్




**ఢిల్లీ, మహా:** ఓట్ చోరీపై తాను చేసిన ఆరోపణలకు సంబంధించి రాహుల్ గాంధీ అఫిడవిట్ ఇవ్వాలి లేదా దేశానికి క్షమాపణ చెప్పాలని కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తేల్చి చెప్పారు. రాజ్యాంగ సంస్థలను అవమానించడం సరికాదని, తమ భుజాలపై తుపాకీ పెట్టి రాజకీయాలు చేయాలనుకోవడం సరైన విధానం కాదని ఆయన అన్నారు. ఎన్నికల సంఘానికి ఎలాంటి భేదభావాలు ఉండవని, అన్ని పార్టీలను సమానంగా చూస్తామని పేర్కొన్నారు. ఓటు చోరీ పేరుతో కొందరు అనవసర అనుమానాలు లేవనెత్తుతున్నారని ఆక్షేపించారు. బీహార్‌లో ఓటరు జాబితా సమగ్ర సవరణపై రాహుల్ గాంధీ ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో మీడియా సమావేశం నిర్వహించిన సీఈసీ.. ఓటరు జాబితాను బూత్ లెవల్‌లోనే ప్రతి పార్టీ చూసుకుంటుందన్నారు. సంస్కరణల్లో భాగంగానే ఓటరు జాబితాను సవరిస్తున్నట్లు స్పష్టం చేశారు. బీహార్‌లో ఎస్ఐఆర్‌పై కొన్ని పార్టీలు, సంబంధిత నేతలు అసత్య ప్రచారం చేయడం తీవ్ర ఆందోళనకరమన్నారు. ఎన్నికల సంఘం భుజాల పైనుంచి కొన్ని రాజకీయ పార్టీలు దాడులు చేస్తున్నాయని, బిహార్ ఓటరు ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని అన్ని రాజకీయ పార్టీలకు సూచిస్తున్నామన్నారు. బూత్ స్థాయి అధికారులు, ఏజెంట్లు పారదర్శకంగా ఈ ప్రక్రియలో నిమగ్నమయ్యారని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ పేర్కొన్నారు.

**ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే..**

డబుల్ ఓటింగ్, ఓటు చోరీ ఆరోపణలకు ఎన్నికల సంఘం కానీ, ఓటరు భయపడే ప్రసక్తే లేదన్నారు. కోటి మందికిపై ఉద్యోగులు ఎన్నికల విధుల్లో నిమగ్నమయ్యారని, ఇంత పారదర్శకంగా చేపట్టిన కార్యక్రమంలో 'ఓటు చోరీ' ఎలా సాధ్యమవుతుంది? అని ప్రశ్నించారు. ఆధారాలు లేకుండా జాబితా నుంచి ఓటరు పేరు తొలగించామని, ప్రతిఒక్క ఓటరుకు ఈసీ దన్నుగా నిలుస్తుందని సీఈసీ స్పష్టం చేశారు. సవరణ ప్రక్రియ హడావుడిగా చేస్తున్నామన్నది అవాస్తవమన్నారు. ప్రతి ఎన్నికల ముందు ఓటరు జాబితాను సరిచేయడం ఎన్నికల సంఘం విధి అని గుర్తు చేశారు. ఓటరు జాబితాలను సవరించేందుకు దేశంలో ఇప్పటివరకు 10 సార్లకుపైగా సవరణలను చేపట్టామని, పశ్చిమ బెంగాల్‌తోపాటు ఇతర రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌ను నిర్ణీత సమయంలో ప్రకటిస్తామన్నారు. ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే సెప్టెంబర్ 1లోగా తెలియజేయాలని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీలను అభ్యర్థిస్తున్నాని ఎన్నికల ప్రధాన కమిషనర్ వెల్లడించారు.

# తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రాదు

- ఆ పార్టీకి రాష్ట్రంలో అధికారం అంతా ఈజీ కాదు
- వాళ్ల పేర్లు చెప్పలేను కానీ, వారి వల్లే బీజేపీకి చాలా నష్టం
- బీజేపీపై ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం రాదని ఎమ్మెల్యే రాజాసింగ్ జోస్యం చెప్పారు. తెలంగాణ బీజేపీపై ఆయన హాట్ కామెంట్స్ చేయడం సంచలనంగా మారింది. ఆయన ఆదివారం ఓ మీడియా ఛానల్ ప్రతినిధితో మాట్లాడారు. ప్రతి నియోజకవర్గంలో, ప్రతి జిల్లాలో నా మనిషే అంటే, ఎన్నో ఏళ్ల నుండి ప్రాణం పెట్టి పనిచేసిన పాత కార్యకర్తలు ఎక్కడికి పోవాలి. బీజేపీ అధిష్టానం కూడా తెలంగాణ మీద దృష్టి పెట్టదు.. వాళ్ళు వేరే రాష్ట్రాలను చూసుకుంటారు. రాష్ట్రంలోని పెద్ద బాబులు చెప్పిందే అధిష్టానం వింటుంది. వాళ్ళ పేర్లు చెప్పలేను కానీ, వాళ్ళ వల్ల తెలంగాణ బీజేపీకి చాలా నష్టం జరుగుతుంది' అని రాజాసింగ్ తీవ్ర ఆరోపణలు చేశారు. కాగా, స్టేట్ చీఫ్ పదవిని రామచంద్రరావుకు అప్పగించడానికి నిరసనగా రాజాసింగ్ బీజేపీకి రాజీనామా చేయగా రాజీనామాను అధిష్టానం కూడా ఆమోదించింది. ఆయన అప్పటి నుంచి పార్టీలో కష్టపడే వారికి న్యాయం జరగడం లేదని, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావడం సొంతపార్టీ వారికే ఇష్టం లేదంటూ విమర్శలు చేస్తూ వస్తున్నారు. అయితే రాజాసింగ్ తాజా వ్యాఖ్యలపై బీజేపీ అధిష్టానం ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి.

ఉద్యోగావకాశం
పత్రికా రంగంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న
మహా పత్రికకు
(RNI NO : APTEL/2003/09316)
ఏపీ, తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు జిల్లాల వారీగా
స్టాఫ్ రిపోర్టర్లు కావలెను
WWW.EPAPER.MAHAADAILY.COM
ఆసక్తి గల వారు సంప్రదించండి
MAHAAPATRIKA@GMAIL.COM,
99891 89875, 95501 59679, 90001 41919

మీరు జర్నలిస్ట్ అవ్వాలనుకుంటున్నారా?
జర్నలిజంలో రాణించి సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలను అరికట్టాలనుకుంటున్నారా? అయితే మీకిదే సువర్ణావకాశం
ANN SCHOOL OF JOURNALISMలో
జాయిన్ అయ్యి నిజమైన జర్నలిస్టులుగా గుర్తింపు తెచ్చుకోండి.

గృహిణులు, నిరుద్యోగులు, విద్యార్థులకు
ఇదే మా ఆహ్వానం
పరిమితమైన సీట్లు, సీనియర్ పాత్రికేయులతో విద్యాబోధన
మీరున్న చోటు నుండే ఆన్‌లైన్‌లో జర్నలిజం క్లాసులు
8 వారాలు, 16 ఆన్‌లైన్ క్లాసులు
కోర్సు పూర్తైన విద్యార్థులకు జర్నలిజం సర్టిఫికెట్ ఇవ్వబడును
మెరిట్ స్టూడెంట్స్‌కు ఇంటర్న్ షిప్ అవకాశం.. రికమండేషన్ లెటర్
LIMITED TIME HURRY UP! LIMITED TIME
త్వరపడండి...
FOR ADMISSIONS CONTACT:
+91 99891 89875
SCAN ME
APPLY ON OUR OFFICIAL WEBSITE:
WWW.ANNSCHOOLOFJOURNALISM.COM

ANN తెలుగు
మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 18-08-2025


# మహత్తర మానవ పద్యాలు

ఎవరు బతికిస్తారు?
ఎందుకు బతికుంటారు?
తరతరాలకు తరగని నిధి లా మిగిలుంటారు?
విధిగా బతికుంటారు?
భూమ్యాకాశాల్లానే..
ఆకాశ నక్షత్రాల్లానే..
సమీర సంగీతమై.. అగ్ని సంతకమై
ఎలా నిలబడతారు?
సూర్యుణ్ణి శ్వాసిస్తూ..
వెన్నెలలను ఎలా పంచుతారు ?
బతికుండగా మరణిస్తారు.
మరణాంతరం బతికుంటారు.
బతికి ఉండడం అంటే
జ్ఞాపకాలుగా మిగిలి ఉండడమా?
కాదు, కాదు
కార్యాచరణ పథ గాములుగా
కొందరిని ముందుకు నడిపిస్తారు.
వెలుగు దారులై వికసిస్తారు.
వాళ్లు కవులు. కళాకారులు.
శక్తివంతమైన ఒక వాక్యమై బతుకుంటారు.
విశ్వ వీణా తంత్రులై
స్వాతంత్ర సంగీతభేరులై నిలుస్తారు.
మహానిర్మాణాల చోధక శక్తులై
గమిస్తారు.
వేగుచుక్క లాంటి వాక్యాలు బతికిస్తాయి.
స్వరవిస్ఫోటనా ధారలై ప్రవహిస్తారు.
వాటిని తమ జీవితాలుగా మలుచుకున్న ప్రజలు
నిత్య నూతనంగా వారిని బతికిస్తారు.
మార్పుగా, ఒక మహత్తర ప్రజా చైతన్యంగా
బతుకుతారు.
ఆ అక్షర కిరణాలను అవాహన చేసుకున్న ప్రజలు
బతికిస్తారు.
వారి ఉద్యమ కెరటాల హోరును
ఆకాశమెత్తు నినదిస్తారు.
వ్యవస్థ కోసం, సమస్త ప్రజల శ్రేయస్సు కోసం అక్షరంగా
మారిన వాళ్లు ప్రజల్లోనే..
ప్రజలు గానే బతికి ఉంటారు.
సమస్త పీడనల విముక్తి క్షేత్రాలై
విలసిల్లుతారు.
వాళ్లు క్రాంతి దూతలు.
అమ్మతనాన్ని చనుబాల ధారలా
సమస్త ప్రజలకు పట్టిచ్చినవారు.
వాళ్లు ప్రేమికులు.
చిరు దరహాస పద్యమై దీవించే అమృత మూర్తులు.
భూమి స్వప్నాలు.
స్వప్న హస్తాలు.
మట్టి నుండి విరబూసే మానవ పద్యాలు.
నింగి నంటే అగ్గి పిడుగు బావుటాలు.
ఊహలకు ఊపిరులూదే
ఐకాంతిక సౌందర్య దీపాలు.
వాస్తవ జీవన సంఘర్షణల
సత్య సంగీతాలు.
సమస్త విశ్వానికి మానవ భాషను
ప్రేమగా అద్దిన పద్య పరిమళాలు.
ప్రజా విప్లవ ఆకాంక్షల ను కిరీటాలుగా ధరించిన
వీర విజయాలను గాలిలో
వెదజల్లుతారు.
బతుకు గొప్పదనాన్ని
బహు స్వేచ్ఛగా
బతుకు పచ్చదనాన్ని
బహు సౌందర్యంగా మలిచిన
అక్షరాల జాతర వాళ్ళు.
ప్రజాకాక్షల యుద్ధ పాతరవాళ్ళు.
వాళ్లు దయగల తల్లులు.
ప్రేమగా, మృదువుగా,
అక్షరాలను తల్లుల్లా ప్రేమిస్తారు.
అక్షరాలను అమ్మలుగా మలుస్తారు.
ఆకాశ స్వరాలై
చైతన్యోత్సవ జీవనోత్సాహ
వర్షాలై కురుస్తారు
వాళ్లు అనంత శక్తివంతమైన ప్రేమికులు.
మానవ పద్యాలై పరివ్యాప్తమవుతారు.
పద్యనాదాలై నర్తిస్తారు
వాళ్లను ప్రకృతి ప్రేమిస్తుంది.
కాలమే కరిగి వాళ్ళై జీవిస్తుంది.
వాళ్లు చలన సూత్రధారులు.
పంచేంద్రియాలుగా,
పంచభూతాలుగా
ప్రపంచాన్ని నడిపించే సమవర్తులు.
వాళ్లు కవులు. కళాకారులు
సాంస్కృతిక ప్రజా పోరాట ధీరులు.
వాక్య జలపాతమై ప్రవహిస్తారు.
డప్పు గుండెలై జ్వలిస్తారు.
మరణం లేని మహోన్నతమైన
వాక్యాలుగా విస్తరిస్తారు.
వాక్యానికి అనంత శక్తినిచ్చి
మణిమయ దీప కాంతులతో
ధగద్ధగాయమానంగా ప్రకాశిస్తారు.
పసి నవ్వులై సమాజాన్ని దీవిస్తారు.
జీవితేచ్ఛగా బతికే ధైర్యమౌతారు.
అమోఘంగా, సమ్మోహన భరితంగా, మానవ పరిమళంగా
ఒకానొక మానవ సౌందర్య భరిత అద్భుత ఉదయంలా
తమ వాక్యాల్ని ఈ లోకం మీద వెదజల్లుతారు.
తమ స్వేచ్ఛ స్వరాలను
ప్రజా చైతన్య నరాలుగా మలుస్తారు.
జన్మజన్మల సౌరభాన్ని నింపడానికి తల్లిలా, తల్లి
చేతుల్లో వెలిగే దీపంలా.. నిన్నూ నన్నూ
సమస్త విశ్వాన్ని ప్రేమగా నిలబెడతారు.
మానవసారభూత మూలమైన
ప్రకృతి వేర్లు వాళ్ళు.
కవులు, కళాకారులు లేని దేశాన్ని, ఊహించగలమా?
ఊహ లేని దేశాన్ని
వీక్షించగలమా ?
వాళ్లు కవులు. కళాకారులు.
సాంస్కృతిక యోధులు.
జగచ్ఛక్షువులు వాళ్ళు.



- శిఖా ఆకాష్, సెల్:9381522247

# చైతన్య ఝరి గిరిజన కవిత్వపు సిరి




- డాక్టర్ కొత్వాలు అమరేంద్ర,
సెల్ : 9177732414

అంతవరకూ ఆత్మీయతారాగాలు పలికిన అందమైన ఆకుపచ్చని అడవివున్నట్టుండి మనిషి స్వార్థపు మంటల సెగల్లో ఆహుతి అయిపోతూ తన ఉనికినే కోల్పోతుంటే దాని చల్లని నీడలో సేదదీరే అడవిబిడ్డల అలజడి అక్షరమైంది. ఆ అక్షరం వారి అస్తిత్వవేదనను ఆవిష్కరించింది. అదే గిరిజన కవిత్వం. ప్రపంచీకరణ, పారిశ్రామికీకరణ పేరుతో, అభివృద్ధి మిషతో అడవుల పచ్చదనాల్ని కాంక్రీటు కట్టడాలుగా మార్చేస్తూ అడవిబిడ్డలకు నిలువనీడలేకుండా చేసే కార్పొరేట్ శక్తుల మాయాజాలాన్ని అది తూర్పారబడుతోంది. పూలసరాగాల్లో తేలియాడే బ్రతుకుల కోసం తపిస్తోంది.

ఇప్పుడు అడవి దుఃఖం సార్వజనీనమైపోయింది. అడవులు ఎక్కడున్నా కొన్ని మానవ తప్పిదాల మంటల్లో అవి ఆహుతి అయిపోతూ నిరాశ్రయులయ్యే అడవిబిడ్డలకు అస్తిత్వపోరాటం తప్పడంలేదు. అందుకే ఎంతోమంది సామాజిక ఉద్యమకారులతో బాటు కవిత్వమూ గిరిజనులకు అండగా నిలుస్తోంది. 'వేదన వున్నప్పుడు అడవుల్లో, పర్వతాల్లో గడ్డిభూముల్లో ప్రజలు మట్టిగుడిసెలను వీడి వరదపాలైన గూడునుంచి ఎలుకలు తప్పించుకున్నట్టు వెళ్లిపోతుంటారు. వారి నడుం వంకర్లలోంచి, వారి కన్నీళ్లలోంచి ఆదివాసీ కవిత్వం ఆవిర్భవిస్తుంది' అంటాడు ఆదివాసీల పక్షాన నిలిచి కవితాయాత్ర సాగించిన గుజరాతీకవి జితేంద్ర వాసవ్. ఆదివాసీల జీవితాలతో మమేకమైన జార్కండ్ కవయిత్రి, జర్నలిస్టు, సామాజిక ఉద్యమకారిణి జసింతా కెర్కెట్టా అక్కడి గిరిజన జీవనపార్శ్వాలను, కుచించుకుపోతున్న అక్కడి సారందా అడవి ఆవేదనను తన కవిత్వంలో ఆవిష్కరించింది. 'ఇప్పుడు కన్నీళ్లను అపడానికి ఒక ఆనకట్ట/ఇప్పుడు ఉప్పొంగుతున్న కోపాన్ని అరికట్టడానికి ఒక ఆనకట్ట/తిరుగుబాటులో కొండలనుంచి సాకులా కొమ్మలు గర్జించినప్పుడు/నాశనం చేసే, స్థానభ్రంశం చేసే శక్తులను తుడిచిపెట్టినప్పుడు/ఈ ఆనకట్టలు ఒకరోజు ఖచ్చితంగా పగిలిపోతాయి' అంటుంది, ఆనకట్టల నిర్మాణంతో విధ్వంసమయ్యే గిరిజన జీవితాల ఆనంత దుఃఖం ఈ కవితాపంక్తుల్లో వ్యక్తమవుతుంది.

**విప్లవకవిత్వంలో అంతర్భాగంగా...**

తెలుగులో గిరిజనకవిత్వం తొలిరోజుల్లో ప్రత్యేకంగా చోటుచేసుకోలేదు. కొన్ని జానపదగీతాలు గిరిజనుల జీవితాల్ని వడపోశాయి. అరవయ్యోవ దశకంలో ప్రారంభమైన విప్లవకవిత్వం గిరిజనుల పక్షాన కూడా నిలిచి వారి ఆవేదనను కొంతవరకు ఆవిష్కరించింది. అప్పుడు బెంగాల్ లో చోటుచేసుకున్న నక్సల్బరీ పోరాటానికి సమాంతరంగా శ్రీకాకుళంలో చోటుచేసుకున్న గిరిజన రైతాంగపోరాటం విప్లవకవిత్వానికి తొలినేపథ్యమైంది. అక్కడి అడవుల్లోని అమాయకులైన గిరిజనులను దోచుకునే భూస్వాముల అకృత్యాలపై విప్లవకవులు కవితాస్త్రాలను సంధించారు. 'కొండలప్రక్కన బండలు కొట్టే గిరిజనుడా/ఇటురావయ్యా ఓ గిరిజనుడా ఇటురావయ్యా/పుట్టలప్రక్కన కట్టెలు కొట్టే గిరిజనుడా ఇటు రావయ్యా'(సుబ్బారావు పాణిగ్రాహి), 'శ్రీకాకుళం అడవుల్లో చీమలు పాముల్ని చంపుతాయి/సింహాద్రి శిఖరం మీద ఎలుకలు పిల్లిని చంపుతాయి'(శ్రీశ్రీ) వంటి చైతన్యపరిచే కవితాపంక్తులు చోటుచేసుకున్నాయి. ఆ తరువాత వెలువడిన మరో విప్లవకవి జైరాజ్ 'హోరెత్తే ఎర్రగాలి'(1981), 'శ్రీకాకుళ ఉద్యమం'((1989) వంటి కవితాసంకలనాలు గిరిజనుల అస్తిత్వవేదనను ప్రత్యేకంగా ప్రస్తావించాయి. 'బరబరనడు రోలె/తుగపోడుమీద కట్టుకున్న గూళ్లు, నక్కపోతులు ఎక్కి తొక్కుతున్నాయట/తుంబముల్లును బట్టరా కౌజన్న/తిరగేసి దిగ్గొట్టరా'(పిట్టలపోరు) అంటూ వంగపండు ప్రసాదరావు ప్రతీకలతో శ్రీకాకుళ పోరాటాన్ని ధ్వనింపజేస్తూ విప్లవప్రబోధం చేశాడు. 'అడవినోటికడ్డంగా ప్రాజెక్టులు కట్టి/రిజర్వాయర్లలోంచి, ధాన్యాగారాల్లోంచి/శ్రమజలాల ముత్యాలరాశులు కొలుచుకొని/చీకటి బావుల బతుకుల్ని ఇంధనంగా కాల్చుకొని/నగరారణ్య న్యాయ ఉక్కువ్యవస్థను/అడవి రక్తమాంసాలతో సిమెంటు చేసి/అడవిపేగుల కాగితాలపై అభయారణ్య మరణశాసనాలు రాసి...' అంటూ విప్లవకవి వరవరరావు కార్పొరేట్ మాయాజాలంలో అడవులు ఎంతగా కుచించుకుపోతూ నాశనమైపోతున్నాయో వివరిస్తాడు. అదిలాబాద్ అడవిబిడ్డలైన గోండుల జీవనపార్శ్వాలనూ పుక్కిటపట్టుకుంది గిరిజనకవిత్వం. అక్కడి ఆదివాసీబిడ్డల సాంగత్యంలో జీవితం గడిపి గోండుల దుర్భర జీవనవేదనల్ని రచనలుగా




మలిచిన సాహు 'పొదల పొదల గట్ల నడుమ/పొడిచెనొక్క చందమామ../కొమురెల్లి పాటల్లోనా.. ఓ రాజన్నా.. కొలిమంటుకున్న జాడరో ఓ రాజన్నా' వంటి పాటలతో ఆనాడే చైతన్యడంకా మ్రోగించాడు.

**అస్తిత్వపోరాటమే ప్రధానంగా...**

అస్తిత్వపోరాటమే ప్రదాన అంగంగా ప్రారంభమైన బహుజనకవిత్వంలో భాగంగానే గిరిజనకవిత్వమూ ప్రారంభమై ఆదివాసీల బహుముఖ వేదనల్ని ఆవిష్కరిస్తోంది. అభివృద్ధి పేరుతో జరుగుతున్న ఓపెన్ కాస్ట్ మైనింగ్ త్రవ్వకాలు, ఖనిజాల కోసం కొండల త్రవ్వకాలు, రోడ్ల విస్తరణతో కుచించుకుపోయే అడవులు... ఇవన్నీ ఇప్పుడు ఈ కవిత్వానికి ప్రధాన వస్తువులయ్యాయి. గత పదేళ్లలో అడపాదడపా వచ్చిన గిరిజన కవిత్వాన్ని పరిశీలిస్తే అందులో గిరిజనుల జీవితాల్ని ఛిద్రం చేసే పారిశ్రామికీకరణ, ప్రపంచీకరణ పట్ల వ్యతిరేకతే ప్రధానంగా కనిపిస్తుంది. 'పాట బతుకై బతుకు పాటైన వాళ్లు/ఆట బతుకై బతుకు ఆటైన వాళ్లు/వేట బతుకై బతుకు వేటైనవాళ్లు/ఆటపాటవేట/బతుకు బాటైన వాళ్లు'(నేను అడవిని మాట్లాడుతున్నాను) అంటూ సుద్దాల అశక్ తేజ ఆదివాసీకి చక్కని నిర్వచనమిస్తాడు. ఇప్పుడు గిరిజన కవిత్వాన్ని సుసంపన్నం చేస్తున్నవారిలో ఉత్తరాంధ్ర కవులు సిరికి స్వామినాయుడు, మల్లీపురం జగదీష్ లను ప్రముఖంగా పేర్కొనవచ్చు. గతంలో ఆదివాసీ కవిత్వంతో 'మట్టిరంగుబొమ్మలు', 'మంటి దివ్వె' కవితాసంపుటాలను వెలువరించిన స్వామినాయుడు తాజా సంపుటి 'శతర' ఆదివాసీ జీవితానికి సంబంధించిన పలు పార్శ్వాలను పుక్కిటపట్టుకుంది. 'అవనికి పట్టిన ఆకుపచ్చని గొడుగును కూల్చేశాక/యే కాక్రీట్ అడవులు కదిలొస్తాయిక్కడికి/యే నల్లత్రాచు రహదారులు నడిచొస్తాయిక్కడికి/అయినా పచ్చని ఆకాశాన్ని కూల్చేయడం/యే ప్రగతికి ఆనవాలురా నాయనా'(ఒక చెట్టు మరికొన్ని పక్షులు) అంటూ స్వామినాయుడు ప్రభుత్వాలు ప్రగతిపనులుగా భావించే పనుల్ని ప్రగతినిరోధక పనులుగా అభివర్ణిస్తాడు. 'లారీల నిండుగా ఆలమందల్ని కుక్కి/కబేళాలకు కరలించుకుపోయినట్టు/పొగబండినిండా కొండమేకల్ని కుక్కి/కాంక్రీటు అరణ్యాలకు తోలుకుపోతుంది/భవననిర్మాణ కూలీలుగానో/కొలిమికుంపట్ల కార్మకులుగానో/నా అడవిబిడ్డలక్కడ చెమటపూల వనాలై చెల్లిపోతారు'(మోదుగపూలు) అంటూ ప్రభుత్వాలు అడవిబిడ్డల్నిఎంతటి దుర్భరమైన వలసకూలీలుగా మార్చివేస్తాయో పేర్కొంటాడు. 'దుర్ల' కవితాసంపుటితో ఆదివాసీలతో మమేకమై ఆదివాసీ కవిత్వపునగారా మోగించిన మల్లీపురం జగదీష్ 'రంగులు మార్చే రాజకీయాల్ని గమనిస్తూవుండు/కొండల వెనుక పులులూ సిహాలూ తిరుగుతున్నాయ్/నిన్ను ఉద్ధరిస్తామని రంగులబట్ట లేసుకొని/నీ భుజం మీద చెయ్యేసి నీతోనే అడుగు వేస్తుంటాయి/సంక్షేమపథకాల ప్లకార్డులు పట్టుకొని/నీ వెనకే గోతులు తవ్వుతుంటాయి జాగో.. ఆదివాసీ.. జాగో(జాగో.. ఆదివాసీ.. జాగో) అంటూ కార్పొరేట్ శక్తుల నుంచి పొంచివున్న ప్రమాదాన్ని గుర్తించాలని ఆదివాసీలను జాగృతపరుస్తాడు.

**గళమెత్తిన ఆదివాసీ కవయిత్రి**

'నా భాషలో నేను రాస్తాను, నా గొంతులోనే పలుకుతాను' అంటూ ఆదివాసీల పక్షాన కలం పట్టిన వర్తమాన ఆదివాసీ కవయిత్రి కుంజ కళ్యాణి తన అక్షరాల అల్లికలో గిరిజన కవిత్వాన్ని సుసంపన్నం చేస్తోంది. 'ప్రాజెక్టుల పేరిట/నా జాతినంతా మాయం చేసేస్తున్న/ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఎన్నో(ఆదివాసీ)... నా తల్లి పచ్చని అందాలను/ప్రాజెక్టుల కింద పూడ్చిపెట్టి/మానని మా మానసిక గాయాల గోడలు పేర్చి/అటు ఇటు కాకుండా మా బతుకులు నాగం జేసింద్రు'(ధ్వంసం) అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. 'కాలమేదైనా నా మూలంగా మాయమయ్యేది నా అస్తిత్వమే/అక్షరం రానితనానికి వేలిముద్ర సాక్ష్యంగా నిలిచి/వ్యాపారానికి తాకట్టు అయింది/ సంస్కృతి సంపద/పారే ఏరుల ఆకుపచ్చదనం దూరమై/అక్కడేదో ఫ్యాక్టరీ మొలిచింది/అభివృద్ధి పేరిట నేడు చెట్లన్నీ సిలువలు మోస్తున్న అస్థిపంజరాలు'(అడవే కావాలిప్పుడు) అంటూ ప్రపంచీకరణ, పారిశ్రామికీకరణ ముసుగులో గిరిజనుల బ్రతుకులు ఎలా ఛిద్రమైపోతున్నాయో వర్ణిస్తుంది. 'పగిలిన మా గాజుగుండెల్ని, సినిగిన మా సిగ్గుపోల్కల్ని సీర్కపోయి బార్కలైన



మా సెర్మాల్ని/కట్టతెగిన సెరువులైన మా దుక్కాల్ని/పంచుకున్న పక్షులు సత్యాల్ని సాక్ష్యలిస్తయి/గయ్యన్నేమి యినమంటే సిమిటి కొమ్మల సితారు మెట్లు దిగుతుంటే/మీ అన్యాయాలను పందిని బొడిసినట్టు పొడిసే రోజొత్తది' అంటూ మరో వర్తమాన కవయిత్రి జూపాక సుభద్ర వాకపల్లి గిరిజన స్త్రీల మీద జరిగిన అత్యాచారానికి సంబంధించిన కేసును కోర్టు కొట్టేసి వారికి న్యాయం జరగనందుకు తన నిరసన తెలియజేస్తుంది.

'వాళ్లు మొక్కలకు అంటుకట్టినట్టు/నా బతుకుమీద కొత్తకొత్త కలల్ని అంటుకట్టారు/వాళ్లు రెండుగా చీలిన చర్మానికి కుట్టేసినట్టు/అడవిబాటను నగరంలో కలిపికుట్టారు' అంటూ రోడ్లవిస్తరణలో బాగంగా అడవి ఎలా చీలిపోయిందో వర్ణిస్తాడు పోలా విద్యాసాగర్. 'సమదరింగు రాం రాం...సందిరింగు రాంరాం/అదిలాబాద్ అడవుల జిల్లానే/అటవీశాఖ మైదానం చేసింది/అదిలాబాద్ ఆదివాసీల జిల్లానే/మూలవాసుల పూలుగు లేకుండా చేసింది/ మా నేల కింద ఖనిజాలపై బహుళజాతి డేగ కన్నుపడి/అమాంతం మమ్మల్ని టైగర్ జోన్ లోకి నెట్టింది' అంటూ ఖనిజాల కోసం అదిలాబాద్ అడవుల్ని బహుళజాతి సంస్థలు ఛిద్రం చేసిన వైనాన్ని ఎత్తి చూపుతాడు శ్రీమన్నారాయణ. ఆదివాసీల దారుల నిండా ఎరుపు రంగుల్ని గుర్తిస్తూ గోండుల సంస్కృతిని కవిత్వీకరించిన గోపగాని రవీందర్ 'కిరణాల నెవరు ఆపగలరు/పడిన కెరటాలు తిరిగిలేచినట్టు/అరణ్యమంతా కదిలింది/అడవిఒడిలో పెరిగిన పోరుబిడ్డా/అశయం నెరవేర్చు'(జోడెఘాట్) అంటూ కుచించుకుపోతున్న అడవిని ఉద్దేశించి గోండుల్ని జాగృతపరుస్తాడు. 'ఇక్కడ అరుణోదయాల మాటేమో గానీ/ఈనేల బతుకంతా బయలాటలా వుంది/ఆదివాసీ జీవితమంతా యుద్ధకాండలా సాగుతోంది/సరిహద్దుల్ని కాపుగాయాల్సిన సైన్యంలో సగం/సరిగ్గా దేశం మధ్యనే స్థానకముందంటే/ఏ తూటా ఏ పొద్దును ముద్దాడి/ఏ నెత్తుటి చరిత్ర రాస్తుందో' అంటూ కంచరాన భుజంగరావు నిరంతరం తుపాకీల మోతతో అడవుల్లో బిక్కుబిక్కుమంటూ బ్రతికే గిరిజనుల అందోళనకర జీవితాల్ని అభివర్ణిస్తాడు. ఆదివాసీలపై జరిగే అమానవీయసంఘటనలకు స్పందిస్తూ 'అడవిబిడ్డలపై అత్యాచారం చేసిన వాళ్లు/అడవిబిడ్డల్ని అదృశ్యం చేసినవాళ్లు/అడవిబిడ్డలని గాయపరిచినవాళ్లు ...వాళ్లొక ఊరేగింపుగా వెళుతున్నారు/ఉరితీయబడాల్సిన వాళ్లు/ఊరేగింపులో ఉత్సవమూర్తుల్లా వెలిగిపోతున్నారు' అంటూ పలమనేరు బాలాజీ గిరిజనులపై జరిగే అకృత్యాలను, అందుకు కారకులైనవాళ్ల అట్టహాసాల్ని కవిత్వీకరిస్తాడు. అడవిబిడ్డలకు అసరాగా నిలుస్తోంది ఆదివాసీ కవిత్వం. ఛిద్రమైపోతున్న వారి బతుకుల్లో ఆశల పచ్చదనాలు మళ్లీ చిగురించాలని అది తపిస్తోంది. అడవిలో వెన్నెలంత ఆత్మవిశ్వాసాన్ని వారిలో నింపుతోంది. వారంతా తుడుం లాంటి చైతన్యపోరుకు సిద్ధం కావాలని పిలుపునిస్తోంది.

ప్రముఖ తత్త్వ కవి ఉదారి నాగ దాసు స్మారక పురస్కారాన్ని 2025సంవత్సరానికి గాను ప్రముఖ కవయిత్రి తోటనిర్మలారాణిగారికి అవార్డు కమిటీ ప్రకటించిందని, నిర్వాహకుడుడా.ఉదారినారాయణ తెలియ జేశాడు. వచ్చే నెల 7వ తేదీ (792025)నాడు ఆదిలాబాద్ లో ఈ అవార్డు ప్రదానోత్స వం జరుతుందన్నాడు.
ఈ అవార్డు కింద ఐదు వేయిల రూపాయల (5000 = 00)నగదు, ప్రశంసా పత్రం అందజేయడం జరుగుతుందని తెలియ జేశారు.
- డా. ఉదారి నారాయణ, 9441413666

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...


తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ
దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# సామాజిక స్ఫూర్తిని రగిలిస్తున్న కవి

"ప్రద్యుమ్న" ఉపాధ్యాయుడు కావడం వలన నిరంతరం తరగతి గదిలో పిల్లలతో సంభాషించడం, అనేక సమకాలీన సామాజిక విషయాలను పాఠాలుగా పిల్లలతో పంచుకోవడం ప్రద్యుమ్న నిత్య చైతన్యానికి నిదర్శనం. "రూపాంతరం" కవితా సంపుటి ప్రత్యేకంగా ఒక దృక్పదానికి కమిట్ అయి రాసింది కాదు. అన్ని దృక్పధాలని ఆకళింపుకొని కవిత్వాన్ని ఊపిరిగా తీసుకొని సమాజపు చైతన్యానికి కమిట్ అయి రాసిన సంపుటి. ముప్పయి ఒక కవితలు ఉన్న ఈ సంకలనంలో అభ్యుదయ, విప్లవ కవితలు ఉన్నాయి. భావానికి ప్రాముఖ్యతనిచ్చిన కవితలు ఉన్నాయి. సమాజంలోని వైవిధ్యాన్ని వైరుధ్యాన్ని పరిశీలిస్తూ ప్రతి అనుభూతిని ప్రతి స్పందని కవితామయం చేయడం వలన ఈ సంపుటికి ఒక విశిష్టత ఏర్పడింది. సమాజం గుండె చప్పుళ్ళని తన గుండె చప్పుళ్ళుగా చేసుకున్న "ప్రద్యుమ్న"కు ప్రగతిశీల భావాలే ప్రధానం. కవిగా ఒక ఉపాధ్యాయుడిగా తను ఎక్కడ నిలబడ్డాడో మనకు "రూపాంతరం" సంపుటిలోని కవితలు తెలియజేస్తాయి. బహుశా ప్రద్యుమ్న ప్రముఖ కవి కె.శివారెడ్డి స్ఫూర్తితో కవితా రచనలోకి అడుగుపెట్టినట్టున్నాడు. అందుకే నా కవిత్వం అంటూ

**నా కవిత్వం**
**పీడితతాడిత వర్గాలకు దిక్సూచి**
**ఉద్యమాలకు ఊపిరి**
**దిక్కారానికి నిలువెత్తు సంతకం**

అంటూ ఒక స్పష్టమైన దృక్పధాన్ని చైతన్యాన్ని స్ఫూర్తిని ప్రకటిస్తున్నాడు. కవి పరిశీలనా దృష్టి, తాత్విక దృష్టి, సామాజిక స్పృహ, నేటి సామాజిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఉపయోగపుడుతుంది.
కవిత్వ సృజన అంటే అనుభూతుల్ని అనుభవాలను వేటిని విడిచిపెట్టక అక్షర రూపం ఇవ్వడమే. కవి ఈ సంకలనంలో దైనందిన జీవితంలో ఎదురైన సన్నివేశాల్ని, చుట్టూ ఉన్న సమాజాన్ని కొత్తగా చూసే ప్రయత్నం చేశాడు. ఇందులో వైయక్తిక అనుభూతులూ ఉన్నాయి



సామాజిక సమస్యలకు స్పందనలు ఉన్నాయి. ప్రద్యుమ్న కవిత్వంలో అంతర్లీనంగా వేదనా ఉంది ఆవేశం ఉంది ముందుచూపు ఉంది. భవిష్యత్తుకు సంబంధించిన వెతుకులాట ఉంది. ఆధ్యాపక వృత్తిలో ఉంటూ తన అపారమైన భోదనానుభావాన్ని ఒడుపుగా రచనకు ప్రేరణగా వాడుకున్నాడు. ప్రద్యుమ్న తన కవిత్వ వ్యక్తీకరణలో ఆధునికంగా "రూపాంతరం" కావడం కోసం పెనుగులాడిన పద్ధతి ఈ కవిత్వాన్ని చదివిస్తుంది. కవిత్వశైలి సరళంగా సూటిగా ఉంటూ సామాన్య ప్రజలకు కూడా చేరువయ్యేలా ఉంటుంది. సంక్లిష్ట భావాలను కూడా సులభంగా అర్థం అయ్యేట్లు చెప్పడం ఆయన ప్రత్యేకత. ప్రద్యుమ్న కవిత్వంలో లోతైన తాత్విక దృక్పథం అంతర్లీనంగా ప్రవహిస్తుంది. "అయినా సాగిపోవాలి" అంటూ

**అయినా సాగి పోవాలి**
**శక్తిని కూడా గట్టుకోవాలి**
**జీవిత సమరానికి సిద్ధమవ్వాలి**
**మళ్ళీ ఒక జన్మనెత్తాలి**
**కత్తుల వంతెనపై కవాతు చేయాలి.**

కవి తన ఆలోచనలను, అంతరంగాన అలజడి సృష్టించిన చింతనను స్పష్టంగా తెలిపారు. ప్రద్యుమ్న ఆలోచనా నెగడు నిత్యజ్వలితం, కవిత్వం మనిషి మనసునే కాదు మనుగడను ప్రభావితం చేస్తుంది.

**అక్షరాలు నాకు విశ్వాజ్ఞానాన్నంత**
**భోదిసత్వునిలా వివరిస్తున్నాయి.**

అంటున్న "ప్రద్యుమ్న" జీవితంలోని అన్ని రంగులు కవితలన్నింటా పరుచుకున్న ఆర్ద్రత మనిషిని మానవత్వమై పుష్పించమంటుంది. ఆయన వ్యక్తిత్వం సున్నితంగా సూటిగా వ్యక్తం అవుతుంది. కవికి సామాజిక స్పృహ ఉంది కనుకనే సమాజంలో జరుగుతున్న అనేక సంఘటనలకు అక్షరమై ప్రతిస్పందించాడు. "రూపాంతరం" సంపుటిని చదవడం ద్వారా సమకాలీన స్పందనలను చారిత్రక సామాజిక స్థితిగతులను అర్థం చేసుకోవచ్చు. ముఖ్యంగా ఈ సంకలనంలోని కవితలన్నీ రచయితలోని రాజకీయ, స్పృహకు అద్దం పట్టేవే.

**"మళ్ళీ ప్రభవించు" అంటూ**
**మానవ జాతుల మధ్య**
**అంతరాలు నశించేదెన్నడు**
**కులమతల విద్వేషాల**
**గోడలు కూలేదెన్నడు**

కాళోజి స్మరణలో రాసిన కవిత చదివితే కలిగే Inspiration మనిషై నా కవిత్వమైన ఎవరి పక్కన నిలబడ్డామన్నది, ఎవరిపక్కన నిలబడాలో అనేది ఆలోచింప చేస్తుంది. రూపాంతరం (Transformation) కవితా సంకలనం మనిషి అంతరంగ ప్రపంచానికి అద్దం, మార్పును అంగీకరించే, అన్వేషించే ప్రతి పాఠకుడు కవిత్వ ప్రేమికుడు తప్పనిసరిగా చదవవలసిన సంకలనం. కవిత్వం అంటే బయటి మనిషికి, లోపలి మనిషికి జరిగే సంభాషణ, సంఘర్షణ. ఈ సంభాషణను చర్చను నిరంతరం కొనసాగించాలని కోరుకుంటూ కవి ప్రద్యుమ్నకు అభినందనలు.

- మోతుకూరు శ్రీనివాస్
9866061350

## వారధి

ఊబిలో కూరుకు పోయినట్టూ అనిపిస్తుంది
చేతులు తడుముకుంటే
రిక్త హస్తాల్లో ఆకాశం తన అస్తిత్వాన్ని
వెతుకుంటున్నట్టూ ఉంటుంది

అప్పుడప్పుడు అనంతమైన విశ్వాన్ని
మోసే గుండె ఆయాసపడుతూ ఉంటే
బరువు దించుకొని కళ్ళు మూసుకుంటే
వెన్నెలని తుడిచిన చల్లని వేళ్ళ కొసలు
నా అరి చేతుల్లో చేరి
నన్ను తన్మయత్వంలో ముంచేస్తాయి

కనులు తెరిచిన వేంటనే
సూర్యగోళం మీద ఒంటరి నివురు రేణువునై
తెగిన గాలిపటం వలె కొట్టుకు పోతూ ఉంటాను

నువ్వు నాతో చాలా సార్లు అన్నావ్
వడగాలి ధాటికి ముఖం వడలి పోతున్నప్పుడు
కనులు మూసుకుంటే చాలు
చెట్టంత నీడలోఆదమరచి నిద్రపోతూ
ఉన్నటుగా ఉంటుందని

నువ్వు కనులు మూసుకున్నప్పటి
నీ అమరత్వం నా మదిని తట్టినప్పుడల్లా
మాధుర్యాల కొలనులో
అలలమీద ఓలలాడుతున్నావని అనుకుంటాను

కనులు తెరువటం.. కనులు మూయటం
ఈ రెంటికీ నడుమన
కాలం రచించిన కావ్యమే సత్యం

దానికి ముందు మాటలెందుకు
ఆవిష్కరణలెందుకు

- పర్కపెల్లి యాదగిరి,
9299909516

# గ్రామీణ పేదప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు

## ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో డిజిటల్ వైద్య సేవలు





**ఆమనగల్లు, మహా:** గ్రామీణ ప్రాంత పేదలకు ఉచిత వైద్యం అందజేయడమే 'ఐక్యత' లక్ష్యమని,పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందినప్పుడే ప్రతి ఒక్కరు సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు.ఆమనగల్లు మండల పరిధిలోని మెడిగడ్డ తండాలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొబైల్ హెల్త్ క్యాంపు తొలిరోజు విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరంలో 400 మందికి పైగా ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలతో పాటు విలువైన సలహాలు అందించడమే లక్ష్యంగా నియోజకవర్గ ప్రతి గ్రామానికి మొబైల్ హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామని,మీ ఆరోగ్యం మా బాధ్యత ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే తమ లక్ష్యమన్నారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతి గ్రామానికి,ప్రతి కుటుంబానికి ప్రాథమిక ఆరోగ్య సేవలు ఉచితంగా అందించాలనే సంకల్పంతో మొబైల్ హెల్త్ క్లినిక్ సేవల ద్వారా ముందుకు వెళ్తున్నామని, అందులో భాగంగానే మొదటి రోజు మేడిగడ్డ తండాలో వన్ మెడిహబ్ మొబైల్ క్లినిక్ ద్వారా ఉచిత ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలలో ఆరోగ్యం పై పెద్ద ఎత్తున అవగాహన పెంపొందించడమే,కాకుండా టెస్టుల ఫలితాల ప్రకారం వైద్యులు అందించే ముఖ్యమైన సలహాలు,సూచనలు ప్రజలకు ఎంతో మేలు చేస్తాయని, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి,వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేయడం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రజల ఆరోగ్య భద్రత కోసం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు.ప్రజలు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో... మాజీ మండల అధ్యక్షులు మండ్లి రాములు,ఉప సర్పంచ్ మల్లేష్ నాయక్,సీనియర్ నాయకులు,శ్రీరాములు,పురుషోత్తం చంద్రు నాయక్, కిషన్,కుమార్, మల్లేష్,నవీన్,తావ్ నాయక్,తక్రియ,టఖ్య, శ్రీను, అభినవ్, రఘు ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేదోళ్ల రాజు.. సర్వాయి పాపన్న

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఆవిష్కరణ



**ఆమనగల్లు, మహా :** జమీందారుల అరాచకాలను సహించలేక కడుపు మండి కత్తిపట్టిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలీ శ్రీనివాస్ రెడ్డి,ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి,జాతీయ ఓబిసి మాజీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి,పిసిసి సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.ఆయన పేదోళ్ల రాజు అని కొనియాడారు. ఆదివారం కడ్తాల్ మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని గౌడ సంఘం నాయకులతో కలిసి ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాజకీయ, ఆర్థిక సాంఘిక సమానత్వం కోసం పోరాడారు మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని ,బహుజనుల అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేసిన పాపన్నగౌడ్ ఆదర్శప్రాయుడని,ఆయన సేవలు చిరస్మరనీయమన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కులమతాలకు అతీతంగా పాపన్న ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు.బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు సర్వాయి పాపన్న అని పేర్కొన్నారు.సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేసినవారిని అభినందించారు ..ఈ కార్యక్రమంలో నియోజకవర్గ గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో... నక్క పోతు మధు, నక్కపోతు నర్సింహ,గంట ప్రవీణ్, గంటి సురేష్,కావటి శ్రీశైలం,పట్నం పరమేష్,ఎదుల నర్సింహ, గంట నరేష్,కె.కృష్ణ, ఎదుల వెంకటయ్య, పట్నం మహేష్ పుట్టి శ్రీను,టి.స్వామి,వై. స్వామి,అద్దాల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ రిపీట్ అయితే చర్యలు తప్పవు!

- రాజగోపాల్ వ్యాఖ్యలపై వచ్చే సమావేశంలో చర్చిస్తాం
- ఆయన వ్యాఖ్యలు పరిశీలిస్తున్నాం.. ఎవరు రూల్స్ బ్రేక్ చేస్తే వేటు తప్పదు
- కొండా ఫ్యామిలీ నేతల వివాదం, గజ్వేల్ లో కాంగ్రెస్ వర్గ పోరుపైనా కమిటీలు
- కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు
- నేను ఫైర్ కాదు.. ఫైరింజన్: మల్లు రవి

**హైదరాబాద్, మహా:** ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తనకు మంత్రి పదవి అంశం విషయంలో కాంగ్రెస్ అధిష్టానాన్ని, పార్టీ లోని కొందరు సీనియర్ల నేతలను టార్గెట్ చేస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై తాజాగా కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి ఆదివారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజగోపాల్ రెడ్డి వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు క్రమశిక్షణా కమిటీ దృష్టికి తీసుకు వచ్చారని వెల్లడించారు. రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యల గురించి వివరాలు సేకరిస్తున్నామని పేర్కొన్నారు.

**ఎవరు రూల్స్ ఉల్లంఘించినా చర్యలు..**

వచ్చే మంగళవారం క్రమశిక్షణా కమిటీ మరోసారి సమావేశం అవుతుందని, ఆ సమావేశంలో రాజగోపాల్ రెడ్డి అంశంపై చర్చిస్తామని తెలిపారు. పార్టీలో అందరినీ సమన్వయం చేసుకుంటూ, విభేదాలను సరిదిద్దుతూ, అందరూ కలిసి పనిచేసేలా చూసే బాధ్యత తనదేనని మల్లు రవి అన్నారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. పార్టీలో క్రమశిక్షణ చాలా ముఖ్యమని, దానిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని ఆయన పేర్కొన్నారు.

**రెండు ఇష్యూపై కమిటీలు..**

కాగా వరంగల్ కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న అంశాలపై సీనియర్ నాయకులతో కమిటీ వేయమని టీపీసీసీ చీఫ్‌కు వేయమని లేఖ రాశామని మల్లు రవి వెల్లడించారు. గజ్వేల్ దగ్గర డీసీసీ నర్సారెడ్డి దాడి చేశాడని, దానిపై వివరాలు సేకరించామన్నారు. ఈ ఘటన ఇంచార్జ్ మంత్రి వివేక్ సమక్షంలో జరిగిందని, ఆయనను అడిగి వివరాలు సేకరిస్తామన్నారు. నలుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమిస్తామని, ఆ కమిటీ కన్వీనర్‌గా శ్యాం మోహన్ ఉంటారన్నారు.

# తెలంగాణ విశిష్ట సంస్కృతికి ప్రతీక బోనాలు

## కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్



**ఆమనగల్లు, మహా:** కడ్తాల్ గ్రామపంచాయతీ పరిధిలో ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో నాలుగు రోజులపాటు జరిగే బోనాల ఉత్సవాలు అత్యంత అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనరసింహారెడ్డి తెలిపారు. ఆదివారం రోజున కల్వకుర్తి మాజీ శాసనసభ్యులు జైపాల్ యాదవ్, స్థానిక నేతలతో కలిసి ఈదమ్మ మాంధాత దేవాలయంలో నిర్వహించిన అభిషేకం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ముదిరాజు (పెద్దమ్మ బోనాలు),కురుమ (బీరప్ప బోనాలు),వడ్డెర (ఈదమ్మ బోనాలు),రజకుల (మడేలు స్వామి బోనాలు), నాయిబ్రాహ్మనుల (మైసమ్మబోనాలు) ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల కార్యక్రమంలో పాల్గొన్నారు. బోనాల ఉత్సవ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలతో కలిసి బోనాల వేడుకలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జైపాల్ యాదవ్ మాట్లాడుతూ మన ప్రాంతంలో వర్షాలు విరివిగా కురవాలని, పాడి పంటలతో ప్రతి ఒక్కరు కలకలలాడాలని,గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో ఆర్థికాభివృద్ధి చెందాలని, గ్రామ ప్రజలు పూర్తి ఆరోగ్యంతో ఉండాలని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవభక్తితో బోనాల కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని తెలంగాణ సంస్కృతికి ప్రత్యేకమైన గుర్తింపు ఉందని మన సంస్కృతికి విశిష్ట ప్రతీక బోనాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెల్దండ మాజీ జడ్పీటీసీ విజిత రెడ్డి,కడ్తాల్ మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్,మాజీ ఎంపీటీసీ లచ్చిరామ్ నాయక్,జోగు వీరయ్య,బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సత్యం యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గంప శ్రీనివాస్,గురిగల్ల రామచంద్రయ్య, చేగురి రాములు, క్యామ వెంకటేష్, కోషిక యాదయ్య, కేశని యాదయ్య, చెన్నమోని శేఖర్, బోసు వెంకటేష్, రేపని యాదయ్య, గండికోట యాదయ్య, పిప్పళ్ళ వెంకటేష్ ,జల్కం నాగార్జున, బండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నాగార్జునసాగర్ కు కొనసాగుతున్న వరద

**నల్లగొండ, మహా :** ఇటీవల కురిసిన వర్షాలతో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులకు జలకళ సంతరించుకుంది. నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులు నిండుకుండలా మారాయి. జిల్లాలో కురిసిన వర్షాలే కాకుండా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వానలకు భారీగా ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. దీంతో నాగార్జునసాగర్ 20 గేట్లు, పులిచింతల ప్రాజెక్టు 6 గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ కు కృష్ణమ్మ పరవళ్లు పెడుతుండడాన్ని చూసేందుకు పర్యాటకులు పోటెత్తారు. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహంతో సాగర్ పూర్తి స్థాయిలో జలకళను సంతరించుకుంది. నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో అధికారులు మొత్తం 20 క్రస్ట్ గేట్లను 5 అడుగులు, మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శనివారం ఉదయం 14 గేట్ల ద్వారా కొనసాగిన నీటి విడుదల ఎగువ కృష్ణానది పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో ఎన్ఎస్పీ అధికారులు మరో 6 గేట్లను ఎత్తి మొత్తం 20 గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయంలోకి వరద నీరు పోటెత్తుతోంది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రం, కుడి గట్టు విద్యుత్ కేంద్రం, 5 స్పిల్ వే గేట్ల ద్వారా మొత్తం 1,99,544 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్ రిజర్వాయర్ కు విడుదల చేస్తున్నారు. దీంతో నాగార్జునసాగర్ జలాశయం నుంచి 1,56,760 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# యూరియా కొరతపై పార్లమెంట్‌లో నిలదీయండి

## ఈ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి: తుమ్మల

## కాంగ్రెస్ ఎంపీలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫోన్



**హైదరాబాద్, మహా:** తెలంగాణలో యూరియా కొరత అంశాన్ని పార్లమెంటులో కేంద్రాన్ని నిలదీయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ ఎంపీలను కోరారు. ఈ మేరకు రాష్ట్ర కాంగ్రెస్ ఎంపీలకు ఆదివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫోన్ చేశారు. యూరియా కొరత సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర ఎంపీలను కోరారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు తీవ్ర యూరియా కొరతను ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. ఈ అంశాన్ని పార్లమెంటులో లేవనెత్తి, కేటాయింపుల ప్రకారం పూర్తిస్థాయిలో యూరియా సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 202425 సంవత్సరానికి తెలంగాణకు కేంద్రం 9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించగా, జులై 31 నాటికి కేవలం 4.36 లక్షల టన్నులు మాత్రమే సరఫరా అయిందని గుర్తు చేశారు. దీంతో ఏడాదికి ఇంకా 2.24 లక్షల టన్నుల కొరత ఏర్పడిందన్నారు. ఆగస్టు నెలలో 3.50 లక్షల టన్నుల అవసరం ఉండగా, కేవలం 1.70 లక్షల టన్నులు మాత్రమే సరఫరా కావడంతో రైతులు, ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న, వరి పంటలు సాగు చేసే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అయితే ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రి తుమ్మల కేంద్ర ఎరువుల, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు ఇదివరకే లేఖలు రాసి, తక్షణ చర్యలు తీసుకోవాలని గతంలో కోరారు. అలాగే రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఆఫ్సీఎల్) నుంచి స్వదేశీ యూరియా సరఫరాను 30,800 టన్నుల నుంచి 60,000 టన్నులకు పెంచాలని, ఏప్రిల్‌జూన్ మధ్య తలెత్తిన లోటును భర్తీ చేయడానికి అదనపు కోటా కేటాయించాలని కోరారు.

# అలవి కాని హామీలు వద్దని అప్పుడే చెప్పా

## ప్రొఫెసర్ కోదండరాం

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా ఉందని అధికారంలోకి రాకముందే కాంగ్రెస్‌కు తెలుసని, ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చే ముందు ఆలోచించి ఇవ్వాలని కూడా సూచించానని టీజేఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు వాళ్ల పార్టీలో అంతర్గత చర్చ ఉంటుందని దాని ప్రకారమే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్నారు. అధికారంలోకి వచ్చే ముందే అప్పులు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీకి తెలుసని, హామీలపై ప్రకటనలు చేసే ముందే జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నికలకు ముందు చెప్పామని ఇప్పుడు కూడా చెబుతున్నామన్నారు. తాజాగా ఓ న్యూస్ చానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన పలు కీలక విషయాలు పంచుకున్నారు. ఎవరికి నచ్చినా నచ్చకపోయినా రైతు భరోసా, రేషన్ బియ్యం, పించన్లు కచ్చితంగా అమలు చేయాల్సిందేనని అన్నారు. వీటిని అమలు చేశాక రాష్ట్రానికి మిగులుతున్న ఆర్థిక వనరులు చాలా పరిమితమన్నారు. రాష్ట్రంలో ఆర్థిక రంగం పునర్వ్యవస్థీకరణ, ఆదాయం పెంపుపై ఈ ప్రభుత్వం దృష్టి పెట్టాల్సి ఉందన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ఖజానా భర్తీపై కాంగ్రెస్ కొంత దృష్టి పెట్టినప్పటికీ అనుకున్నంత పురోగతి లేదన్నారు. గతంలో బీఆర్ఎస్ చేసిన అప్పులను ఆదాయ సమీకరణ కోణంలో వెచ్చించకుండా నిష్ప్రయోజనం చేసిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితికి కారణం ఎవరు అనేది ఆలోచించాలని అలాగే ఈ పరిస్థితి నుంచి ఎలా బయటపడతాం అనేది ప్రభుత్వం ఆలోచన చేయాల్సి ఉంటుందన్నారు. రాజకీయాల్లో భాష చాలా ముఖ్యమన్నారు. నేటి రాజకీయ నేతల భాష పూర్తి అధ్వాన్నంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో ఈ పార్టీ ఆ పార్టీ అని ఏమీ లేదని, దాదాపు అన్ని పార్టీల నేతల భాష అధ్వాన్నంగా ఉందన్నారు. ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణకు చాలా అన్యాయం చేస్తుందన్నారు.

# భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలి...



**రంగారెడ్డి జిల్లా మహా:** విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకొని, భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, బిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన విజేతలకు, బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి బహుమతులు ప్రధానం చేశారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం, ఉప్పరగూడ గ్రామంలో మాజీ సర్పంచ్, బిఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బూడిద రాంరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయి ఖోఖో, వాలీబాల్, కబడ్డీ పోటీలను, గ్రామ సమీపంలో నిర్వహించారు. నియోజకవర్గంలోని అబ్దుల్లాపూర్మెట్, యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాలోని 34 ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో చదివే 1050 మంది విద్యార్థులు ఈ యొక్క క్రీడలలో పాల్గొనడం జరిగింది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గ్రామాలలో బిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బూడిద రాంరెడ్డి మాట్లాడుతూ.... విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకొని, భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎందరో మహానుభావులు గొప్ప గొప్ప హోదాలో కొనసాగారని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు, ప్రభుత్వం క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి మంచి ప్రోత్సాహకాలను అందిస్తుందని వాటిని అందిపుచ్చుకొని భవిష్యత్తులో ఉన్నతంగా రాణించాలని తెలిపారు. బిఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒక చక్కటి కార్యక్రమాన్ని నిర్వర్తించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులకు క్రీడలతో మానసిక ఉల్లాసం, దేహదాడుర్యం పెంపొందించుకునే అవకాశం ఉంటుందని, క్రీడలలో రాణిస్తే భవిష్యత్తులో మంచి గుర్తింపు వస్తుందని, ఉన్నతమైన ప్రతిభను కనబరిచినప్పుడు భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలుస్తారని విద్యార్థులకు ఆయన సూచించారు. విద్యార్థులు గంజాయి డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఆన్లైన్ గేమ్స్, ఆన్లైన్ బెట్టింగ్ వంటి చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా, ఆటపాటలతో పాటు చదువులోనూ రాణిస్తూ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ఆయన అన్నారు. భవిష్యత్తులో పేద విద్యార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని, ఎల్లప్పుడూ విద్యార్థులకు అండగా ఉంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు గోపాల్, అజయ్, రవీందర్, ప్రభుత్వ పాఠశాలల పీఈటీలు, ఉపాధ్యాయులు పొగాకు సురేష్, పరమేష్, విద్యార్థులు, క్రీడాకారులు పలువురు పాల్గొన్నారు.

# హరీశ్ సోయి లేకుండా మాట్లాడుతున్నారు

## కాళేశ్వరాన్ని 'కూలేశ్వరం' చేసింది మీరు కాదా..?

### బాంబులు పెట్టారు.. కుట్ర చేశారని సిగ్గు లేకుండా మాట్లాడొద్దు

### హరీశ్ రావుపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజం

**హైదరాబాద్, మహా:** మాజీ మంత్రి హరీశ్ రావుపై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుపైన మాజీ మంత్రి హరీశ్ రావు సోయి లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వాళ్లు బాంబులు పెట్టారని, కుట్ర చేశారని సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. కాళేశ్వరాన్ని కూలేశ్వరం చేసింది మీరు కాదా..? అని ఆయన ప్రశ్నించారు. ఆనాడే తమ్మిడిహట్టి దగ్గర బ్యారేజ్ కట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు కదా.. అని నిలదీశారు. ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే మేడిగడ్డ కూలిందని హరీశ్ రావుకు గుర్తు లేదా అని ప్రశ్నించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మేడిగడ్డలో నీళ్లు నిల్వ చేయవద్దని చెప్పిందని పేర్కొన్నారు. కాళేశ్వరం కట్టింది మీ హయాంలోనే.. కూలింది కూడా మీ హయాంలోనే అని ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. ముందు మీరు మీ పార్టీని చక్కదిద్దుకోవాలని సూచించారు. ఎప్పుడు నీళ్లు నింపాలో, ఎప్పుడు వదలాలో సీఎం రేవంత్ రెడ్డికి తెలుసని చెప్పుకొచ్చారు. మీ అవినీతి అక్రమాల వల్లనే కాళేశ్వరం కూలిందని ఆరోపించారు. కాళేశ్వరం తెలంగాణకు గుది బండలా మారిందన్నారు. మేడిగడ్డలో నీళ్లు నిల్వచేసి ఆ బ్యారేజ్ కొట్టుకుపోయి తమ ప్రభుత్వానికి చెడ్డ పేరు రావాలని హరీశ్ రావు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. తాము అన్ని ప్రాజెక్టులు నింపుతాం.. రైతులకు నీళ్లు ఇస్తామని ధీమా వ్యక్తం చేశారు. హరీశ్ రావు బురద రాజకీయాలు మానుకోవాలని ఆయన హితవు పలికారు.




# కాటమయ్యా కరుణించు..

## కాటమయ్య స్వామికి, పోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించిన భక్తులు

## ఆకట్టుకున్న పోతురాజుల విన్యాసాలు

**ఆమనగల్లు, మహా:** ఆమనగల్లు పట్టణంలో ఆదివారం కాటమయ్య, పోచమ్మ బోనాలను మహిళలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రతీయేట శ్రావణ మాసంలో గౌడ కులస్థుల ఆధ్వర్యంలో నిర్వహించే బోనాల పండుగలో మహిళలు బోనం కుండలను నెత్తిన పెట్టుకుని భక్తి గీతాలు ఆలపిస్తూ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా మేళతాళాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కంఠమేశ్వర ఆలయంలో బోనాలను సమర్పించారు. ఆ తర్వాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ వేడుకల్లో గౌడ కులస్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మాజీ ఎన్బీసీ మెంబర్ ఆచారి ,ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, పీసీసీ సభ్యులు ఆయిల శ్రీనివాస్ రెడ్డి,స్థానిక సంఘ సేవకులు పాపిశెట్టి రాము, ఏఎంసీ చైర్మన్ యాట గీత, ఆమనగల్లు మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు అప్పం శ్రీను,కంఠమేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ చుక్కఅల్లాజీ గౌడ్,గంగా రవీందర్, వెంకటయ్య, దుసకంటి యాదయ్య, బాలకృష్ణ, చుక్క నిరంజన్ గౌడ్, చిన్న బాలకృష్ణ, కుమార్, మదన్, పెద్ద నరసింహ, సురేష్,సతీష్ కుమార్,గుండ్రాతి నరేష్ యాదమ్మ, రాఘవేంద్ర గౌడ్, వల్లపు దాసు, శివ,గడిగే శ్రీను,గడిగే నరసింహ,ముకురాల శివ, నరేందర్,ముకురాల నాగయ్య పాల్గొన్నారు





## నగరం ముంపుకు గురికాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలి

**ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేకాధికారి, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక**



**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరం ముంపుకు గురికాకుండా ప్రణాళికా ప్రకారం శాశ్వత చర్యలు చేపట్టాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేకాధికారి, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక అధికారులను ఆదేశించారు. ఆదివారం బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ వివిధ విభాగాలకు చెందిన అధికారులతో కలిసి భద్రకాళి బండ్,చిన్న వడ్డేపల్లి చెరువు, ఐసిసిసి కేంద్రాల్లో క్షేత్ర స్థాయి పర్యటించి సమర్థవంతంగా వరద ముంపు ను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యల పై అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రకాళి చెరువు సమీపంలో ముంపు గురయ్యే ప్రాంతాలైన ఎన్టీఆర్ నగర్, సంతోషిమాత కాలనీ, బృందావన కాలనీ తదితర లోతట్టు ప్రాంతాల్లో ముంపు గురయ్యే ప్రాంతాలైన ఎన్టీఆర్ నగర్, బృందావన్ కాలనీ, సంతోషిమాత కాలనీ గురించి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అక్కడినుండి 12 మోరీల వద్ద వరద నీటి ప్రవాహం పరిశీలించి, అనంతరం చిన్న వడ్డపల్లి చెరువును పరిశీలించి కట్ట మల్లన్న చెరువు నుండి వచ్చే వరద నీటి వల్ల చిన్న వడ్డపల్లి చెరువును ముంపునకు గురయ్యే సమీప ప్రాంతాలు ఎస్ ఆర్ నగర్, సాయి గణేష్ కాలనీ, ప్రజలను సురక్షితంగా పునరావస కేంద్రాలకు తరలించడం, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భం గా ప్రత్యేక అధికారి శశాంక మాట్లాడుతూ నగరం లో వరద నీటి తీవ్రత స్థాయి అంచనాకు వివిధ విభాగాలు సమన్వయం తో పనిచేయాలని అన్నారు. వరద నీటి తీవ్రత, స్థాయిని అంచనా వేయాల్సిన అవసరం ఉందని, నగరం లోని లోతట్టు ప్రాంతాలు ముంపు కు గురికాకుండా భద్రకాళి బండ్ ఇన్ లెట్ వద్ద వాస్తవ సామర్థ్యం ఎంత? ఎంత ఇన్ ఫ్లో వస్తుంది ? ఎంత ఔట్ ఫ్లో వెళుతుంది? లెవెల్స్ ఇంత ఖచ్చితంగా ఉన్నప్పటికీ ఎందుకు ఔట్ ఫ్లో వెళుతుంది? వంటి విషయాల అధ్యయనానికి ఇరిగేషన్, బల్దియా, ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ విభాగాలు సమన్వయం తో స్ట్రీమ్ లైన్ చేసుకోవాలని సక్రమంగా లెవెల్స్ , సామర్థ్యాన్ని నిర్వహిస్తూ ఇన్ ఫ్లో ఔట్ ఫ్లో కు అనుగుణం గా ఎలాభద్రకాళి నిల సామర్థ్యాన్ని పెంచి వరద ముంపు కు గురికాకుండా నీటిని నిలువరించేలా చర్య లు చేపట్టాలని అన్నారు. గ్రీన్ ఏరియా లోకి నీరు చేరకుండా చూడడం తో పాటు లోతట్టు ప్రాంతాలకు వరద ప్రభావితం కాకుండా చూడాలని, నీరు ప్రవహించే గరిష్ఠ సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రైన్ నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. చిన్న వడ్డేపల్లి ప్రాంతాన్ని సందర్శించారు. ముఖ్యంగా భారీ వర్షాలు కురిసే క్రమంలో కట్ట మల్లన్న చెరువు నుండి చిన్న వడ్డేపల్లి చెరువుకు నీరు చేరే క్రమంలో మధ్యలో గల లోతట్టు ప్రాంతాల్లో ప్రధాన డ్రైన్ లు, స్ట్రాం వాటర్ డ్రైన్ లు లేకపోవడం వల్ల లోతట్టు ప్రాంతాలు మునిగిపోతున్నాయని అంతే కాకుండా ఇన్ ఫ్లో వచ్చినప్పుడు గేట్ లెవెల్స్ మేంటెన్ చేస్తూ వంద ఫీట్ల రోడ్ లో ఉన్న ఎస్ ఆర్ నగర్ ప్రాంతం లో అధిక సామర్థ్యం తో మేజర్(పెద్ద) డ్రైన్స్ నిర్మిస్తే సహజ ప్రవాహం ఎప్పటికపుడు వెళ్ళిపోయే అవకాశం ఉందని అన్నారు. అనంతరం బల్దియా ప్రధాన కార్యాలయం లో గల ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేస్తూ వర్షాకాలం నేపద్యం లో నగరం లోని ప్రతి చెరువుకు సంబంధించి నీటి ప్రవాహం ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో కు సమాచారం ప్రతి వార్డు ను ఎప్పటికపుడు అప్రమత్తం చేసే సమాచారం వెళ్లేల ఐ సి సి సి కు అనుసంధానం చేస్తూ వాతావరణం లో సంభవించే మార్పుల ను ఆలారం ద్వారా ట్రాఫిక్ నియంత్రణ కేవలం చేయాలని వరద నీటి ప్రత్యేకాధికారి అన్నారు. అంతకు ముందు నగరానికి చేరుకున్న ప్రత్యేకాధికారిని బల్దియా కమిషనర్ మర్యాదపూర్వకం గా కలిసి పూల మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం లో సి ఏం హెచ్ ఓ డా.రాజారెడ్డి ఇంచార్జి ఎస్ ఈ, సిటీ ప్లానర్ లు మహేందర్, రవీందర్ రాడేకర్, ఏం హెచ్ ఓ డా.రాజేష్, ఈఈ రవికుమార్ వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, సానిటరీ సూపర్ వైజర్ భాస్కర్ గోల్కొండ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్తును మార్చేది విద్యనే... ఉన్నతంగా చదువుకోవాలి

### చిన్నారికి దిశానిర్దేశం చేసిన సీఐ నందీశ్వర్ రెడ్డి




**రంగారెడ్డి జిల్లా మహా:** విద్యార్థుల భవిష్యత్తును మార్చేది విద్యనేనని సిఐ నందీశ్వర్ రెడ్డి అన్నారు. యాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మాల్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన ఒక చిన్న అమ్మాయి తన ఇంటి ముందు చదువుతూ ఉంది. అదే ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ ఇంటి ముందు చదువుతూ కూర్చొని ఉన్న అమ్మాయిని గమనించిన సిఐ నందీశ్వర్ రెడ్డి, వెంటనే తన వాహనాన్ని నిలిపి, ఆ అమ్మాయితో సంభాషిస్తూ కొన్ని ప్రశ్నలు అడిగాడు. ఆ అమ్మాయి చాలా తెలివిగా సమాధానం ఇచ్చింది. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను చేరుకోవాలని, భవిష్యత్తును మార్చేది విద్యనేనని ఉన్నతంగా చదువుకోవాలి చిన్నారికి సీఐ దిశానిర్దేశం చేశారు. ఒక చిన్న బహుమతిని ప్రదానం చేసి ఆశీర్వదించాడు.

## నేడు జిల్లాకు రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్

**మంచిర్యాల, మహా :** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సోమవారం జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం ఆయన భూపాలపల్లి సిద్దిపేట నుంచి బయలుదేరి జిల్లాలోని బెల్లంపల్లి పట్టణం చేరుకొని, పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల, బాలుర పాఠశాలలను సందర్శిస్తారు. మధ్యాహ్నం భోజనం బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వార్డ్ నెంబర్ 21 బూడిదగడ్డ బస్తీ వద్ద వినాయక విగ్రహం తొలగింపునకు సంబంధించిన విషయాన్ని పరిశీలిస్తారు. అనంతరం బెల్లంపల్లి నుంచి బయలుదేరి జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని సాయికుంట గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను సందర్శిస్తారు. పర్యటన ముగించుకొని సాయంత్రం ఆయన మంచిర్యాల నుండి భూపాలపల్లి సిద్దిపేటకు తిరిగి వెళ్తారని తెలిపారు.

## వరద ప్రభావిత ప్రాంతాలలో కలెక్టర్, ఎస్పీ పర్యటన

### దెబ్బతిన్న ఇండ్లు, రోడ్లు, పంటపొలాల పరిశీలన

**ఆదిలాబాద్ మహా :** శనివారం కురిసిన భారీ వర్షం నేపథ్యంలో ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వరద ప్రభావిత ప్రాంతాలైన వికలాంగుల కాలనీ, జీఎస్ ఎస్టేట్ కానీలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా , ఎస్పీ అఖిల్ మహాజన్ సందర్శించి పరిశీలించారు. అదిలాబాద్ రూరల్ లోని యశ్వంత్ గూడ నుండి భర్నూర్ వరకున్న తీన్ నాలా చెరువు కట్ట తెగిపోవడంతో పరిస్థితిని సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ ఎస్పీలు మాట్లాడుతూ జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు, వర్షాల కారణంగా జరిగిన పంట నష్టం, ఇళ్లలోకి నీరు చేరి, తదితర ఘటనలపై పూర్తి సమాచారం సేకరించి, ఎస్డీఆర్ఎఫ్ మార్గదర్శకాలను అనుసరించి తగిన సహాయం అందించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించామని తెలిపారు. వర్షాల వల్ల ఆదిలాబాద్ జిల్లాలో ఎక్కడా పెద్ద స్థాయిలో నష్టం జరగలేదని పేర్కొన్నారు. అయితే, మరో 3,4 రోజుల పాటు వర్ష సూచనలు ఉన్నందున, అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.లో లైయింగ్ ఏరియాలు, నీరు పొంగి ప్రవహించే ప్రాంతాల్లో అధికారులు ఎప్పటికప్పుడు ఫీల్డ్ లో ఉండాలని, ప్రజలకు అవసరమైన సమాచారం అందిస్తూ జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెన్ గంగా నది ప్రవాహం పెరిగిన నేపథ్యంలో, బోరజ్, జైనథ్, బేలా మండలాల్లో వాటి పరిసర గ్రామాల్లో నీటి ప్రవాహం ముప్పు ఉందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో అధికారులను అప్రమత్తం చేసి, ప్రజలను ముందుగానే హెచ్చరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.చెరువులు తెగిపోవడం తో పంట చేలలో వరద నీరు చేరి పంట నష్టం ప్రాథమికంగా సుమారుగా 350 ఎకరాల్లో నష్టం జరిగినట్టు అంచనా వేసామన్నారు. పంటల నష్టం వివరాలు సర్వే నిర్వహించి తదుపరి చర్యల నిమిత్తం ప్రభుత్వానికి నివేదిక సమర్పించే చర్యలు ముమ్మరం చేస్తున్నామన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం పై అంచనా వేయాలని వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ స్వామిని ఆదేశించారు.అధికారులు మారుమూల గ్రామాలలో దెబ్బతిన్న రోడ్లు వంతెనలకు యుద్ధ ప్రాతిపదికన మరమత్తులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని చోట్ల మెడికల్ క్యాంప్ నిర్వహించాలని, ఈ సందర్భంగా పలు కాలనీలలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ లను జిల్లా కలెక్టర్ ఎస్పీ లు పరిశీలించారు. అలాగే ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ స్వామి, పలు శాఖల సిబ్బంది తదితరులు ఉన్నారు.






## సోతుకు రత్న జానకి మరిన్ని సంపుటీలు రచించాలి

**మందమర్రి, మహా :** రచయిత్రి సొత్కు రత్న జానకి మరిన్ని సంపుటీలు రచించాలని సినీ ,టివి గేయ రచయిత మల్లిక్ పేర్కొన్నారు. ఆదివారం మందమర్రి సింగరేణి సి.ఈ.ఆర్. క్లబ్ లో సొతుకు రత్నజానకి రచించిన "సృష్టిసాక్ష్యాలు" చిత్రకవితా సంపుటిని, ఆయన ఆవిష్కరించారు. ఇదే కాకుండా ఇంతకు క్రితం 2023లో "మాకూ ఉన్నాయి రెక్కలు" వచనకవిత్వాన్ని మంచిర్యాలలో, రచయిత, కాలమీస్ట్ అన్నవరం దేవేందర్ ఆవిష్కరించడం జరిగిందని వెల్లడించారు. 2024లో లఘుప్రక్రియలో 500 శ్రీపదాలను రచించిన "మనోహరాలు" రెండవ సంపుటిని గోదావరిఖనిలో కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దండనాయకుల వామన రావు, అల్లాడి శ్రీనివాస్ ,తోకల రాజేశం, నీలాదేవి,నోముల చంద్రశేఖర్,లైన్స్ క్లబ్ మెంబర్స్ రత్నం , పోల్ శ్రీను,సుదర్శన్ ,సతీష్,కొట్ల అనిత పాల్గొన్నారు. అంతరం పుస్తక రచయిత రత్న జానకిని, ముఖ్య అతిథులను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

## ఓరియంట్ సిమెంటు పరిశ్రమ ఎన్నికలు వాయిదా

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం దేవపూర్ ఓరియంట్ సిమెంట్ పరిశ్రమ గుర్తింపు సంఘం ఎన్నికలు వాయిదా వేస్తూ కార్మిక శాఖ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అందుకు అనుగుణంగా పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు.9 మంది ఓట్లను తొలగించిన నేపథ్యంలో అభ్యంతరాలు రావడంతో పరిశీలించేందుకు వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. 26వ తేదీ వరకు సమావేశం నిర్వహించి, నిర్ణయం తీసుకునేందుకు ఉత్తర్వులు విడుదల చేశారు. అయితే ఈ పరిశ్రమలో ఎన్నికలు ఆగస్టు 19న నిర్వహించవలసి ఉంది. ఈ ఎన్నికలు కాస్త నిలుపుదలకు ఉత్తర్వులు రావడంతో జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.




## లక్ష గాంధీ విగ్రహాల ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ



**ఆమనగల్లు, మహా:** స్వదేశీ స్వలంబన స్వాభిమానం సుస్థిరాభివృద్ధి సాధనల కోసం గాందేయమార్గం గొప్పదని సంఘ సేవకులు పాపిశెట్టి రాము అన్నారు.ఆదివారం అమనగల్లు పట్టణ కేంద్రంలో గాంధీజీ లక్ష విగ్రహాల సాహిత్యము చరఖాల ప్రదర్శనలతో జాతీయ స్థాయి సమ్మేళనం పోస్టర్ ను ప్రముఖ లాంఛనంగా ఆవిష్కరించారు సంఘ సేవకులు రాము మాట్లాడుతూ ప్రతి ఇంటిలోగాంధీజీ భావజాలం ఉన్నట్లయితే ఆ ఇల్లు ప్రశాంతమైన వాతావరణం ప్రతి హృదయం శాంతి మయంగా ఉంటుందని వందకు పైగా దేశాలలో మహాత్మా గాంధీ తత్వం ఏదో ఒక రూపేనా వర్ధిల్లుతుందన్నారు. అక్టోబర్ నెలలో నగరంలోని ఎల్బి స్టేడియం లో ఆరు రోజులు మహాత్మా గాంధీ సుస్థిర మహా విజ్ఞాన సదస్సు స్వదేశీ మేళానునిర్వహిస్తున్నామని లక్ష గాంధీ విగ్రహాల ప్రదర్శన వెయ్యి చరకాల లక్ష గాంధీ పుస్తకాల ప్రదర్శనలు ఉంటాయని గాంధీ గ్లోబల్ సాహిత్య అధ్యక్షుడు కే గోపాల్ వివరించారు. ఇది ఒక గాంధీ మహోత్సవంగా జాతీయస్థాయిలో భారీగా నిర్వహిస్తున్నట్లుగా ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ సాహితి అధ్యక్షులు కే గోపాల్ జి,లక్ష గాంధీ విగ్రహాల కమిటీ కో కన్వీనర్ పల్లె శ్రీనివాస్ గౌడ్, శ్రీను నాయక్, భాస్కర్, రమేష్, రాకేష్, గోపాల్, శివ, జైపాల్, శ్రీను పాల్గొన్నారు .


## నేడు ఎస్పీ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ సమితి సమన్వయ సమావేశం

**ఆదిలాబాద్ మహా :** త్వరలో రానున్న గణపతి నవరాత్రి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆధ్వర్యంలో నేడు ఉదయం 10 30 కు దస్నాపూర్ లోని తనిషా గార్డెన్ లో సమన్వయ సమావేశాన్నిఏర్పాటు చేసినట్టు డీఎస్పీ జీవన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల ముందస్తు చర్యలో భాగంగా గణపతి మండప కమిటీ సభ్యులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులతో జిల్లా పోలీసుల సమావేశానికి ఎస్పీ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఉత్సవ నిర్వహకులకు మండపాల ఏర్పాటుపై, మండపాల వద్ద తీసుకోవలసిన జాగ్రత్తలపై, కమిటీ సభ్యులు చేయవలసిన విధి విధానాలపై ప్రత్యేక సూచనలు సలహాలను ఇవ్వనున్నట్లు తెలియజేశారు. ఆదిలాబాద్ వన్ టౌన్, టూ టౌన్, మావల, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రతి ఒక్క మండప కమిటీ నుండి అలాగే హిందూ ఉత్సవ సమితి నుండి అధ్యక్షుడు ఉపాధ్యక్షుడు లేదా కమిటీ సభ్యులు తప్పకుండా సమావేశంలో పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశాన్ని విజయవంతం చేసి పోలీసులతో సత్సంబంధాలను కొనసాగించవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## ఉమ్మడి జిల్లాకు మరో రెండు రోజులు వర్ష సూచన

**అప్రమత్తంగా ఉండాలని ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాలు**

### ఆదిలాబాద్ నిర్మల్ కలెక్టర్లతో జూమ్ మీటింగ్.. క్షేత్రస్థాయిలో చర్యలపై దిశానిర్దేశం



**ఆదిలాబాద్ మహా :** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులపై ఆదిలాబాద్, నిర్మల్ కలెక్టర్లతో జూమ్ మీటంగ్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. శాఖల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. రిజర్వాయర్లకు సంబంధించిన ఇన్ ఫ్లో అవుట్ ఫ్లోల గురించి ఆరా తీశారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టంపై నివేదిక తయారు చేయాలని సూచించారు. చెరువులకు, కాల్వలకు గండ్లు పడినట్లైతే వెంటనే వాటిని పూడ్చివేయాలని, రోడ్ల మరమ్మత్తులు చేపట్టాలని చెప్పారు. ఎగువన కురుస్తున్న భారీ వానల నేపథ్యంలో పెన్ గంగా ఉధృతంగా ప్రవహిస్తున్నందున ముంపు ప్రాంతాల దృష్టి పెట్టాలన్నారు. వరద నీరు నిలిచి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖ అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలానే త్వరతగతిన సహాయక చర్యలు చేపట్టాలని, ప్రభావిత మండలాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ఆర్ డబ్ల్యుఎస్, హెల్త్ అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని చెప్పారు. ప్రమాదకరంగా పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. రోడ్ల మీద నీరు పూర్తి స్థాయిలో తగ్గే వరకూ ప్రజలు బయటకు రాకూడదని, సహాయక చర్యల్లో ప్రజలు అధికారులకు సహకరించాలని మంత్రి కోరారు.

## భర్తలను బలిగొంటున్న అక్రమ సంబంధాలు

- ప్రియుడితో కలిసి భార్య.. భర్త పై హత్యాయత్నం
- నగరంలో సంచలనం రేపిన హత్యాయత్నం కేసు.. ఛేదించిన మట్వాడ పోలీసులు



**వరంగల్ మహా ;** ఇటీవల అక్రమ సంబంధాలు పచ్చని కాపురాల్లో చిచ్చు రేపుతున్నాయి. కొంతమంది వివాహిత మహిళలు పేగు బంధం, ఆప్యాయత మానవత్వాన్ని మరిచి క్షణికావేశంలో అడ్డుగా ఉన్న తన కుటుంబ సభ్యులతో పాటు భర్తను కూడా చంపడానికి వెనుకాడం లేదు. ఇటీవల ఇలాంటి దరుణమైన సంఘటనలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలోనే అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కట్టుకున్న భర్తను హతమార్చాలని భార్య, ఆమె ప్రియుడితో కలిసి పన్నిన దారుణమైన కుట్రను మట్వాడ పోలీసులు ఛేదించారు. పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీఐ ఎన్ కరుణాకర్ రావు నేతృత్వంలో బృందాలుగా ఏర్పడి నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి కీలక సాక్ష్యాలతో పాటు కొంత డబ్బును, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నారు.

**ఘటన వివరాలిలా**

కరీంనగర్ జిల్లా..మోత్కుల గూడెం, జమ్మికుంటకు చెందిన పోతుల సందీప్ (29) అనే ప్రైవేట్ బిల్డింగ్ కాంట్రాక్ట్ వర్కర్ కు, వరంగల్ కు చెందిన గంగరబోయిన పద్మ (37)తో మూడు సంవత్సరాల క్రితం వరంగల్ బస్టాండ్ వద్ద పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాస్త అక్రమ సంబంధానికి దారితీసింది. పద్మ భర్త రాజు లేని సమయంలో సందీప్ తో ఆమె ఈ సంబంధాన్ని కొనసాగించింది.

**చిట్టీ వివాదంతో బట్టబయలైన సంబంధం**

సందీప్ వద్ద రాజు లక్ష రూపాయల చిట్టీ వేశాడు. ఈ క్రమంలో సందీప్, తన భార్య మధ్య ఉన్న అక్రమ సంబంధం కాస్త రాజుకు తెలిసిపోయింది. దీంతో భార్య పద్మ, సందీప్‌ల మీద అనుమానం పెరిగి, ఈ విషయం వివాదానికి దారితీసింది. తమ అక్రమ సంబంధానికి భర్త రాజు అడ్డు వస్తున్నాడని భావించిన సందీప్, అతడిని అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 14వ తేదీన సందీప్ తన స్నేహితులైన బబ్లు, షబ్బీర్, స్వర్ణాకర్ లతో కలిసి రాజును వరంగల్ పోతనగర్ డంప్ యార్డ్‌కు పిలిపించి, మద్యం తాగించి రాజు పై దాడి చేశారు. అనంతరం గొంతు నులిమి చంపడానికి ప్రయత్నించగా అటువైపు నుండి వచ్చిన స్థానికులు రాజు అరుపులు విని వారి వద్దకు రాగా సందీప్ తన స్నేహితులతో కలిసి కారులో పారిపోయారు. స్పృహ కోల్పోయిన రాజును వారి కుటుంబ సభ్యులు మొదట ఎంజిఎం ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు రాజు ఆరోగ్యం సహకరించక పోవడంతో గార్డెన్ హాస్పిటల్ లో చేర్పించి చికిత్సను అందిస్తున్నారు. ప్రస్తుతం రాజు ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

**రూ. 9 లక్షలతో పరారీ**

హత్యా ప్రయత్నం తర్వాత, పద్మ తన ఇంటి నుంచి 9 లక్షల రూపాయలను తీసుకుని సందీప్‌తో కలిసి పరారైంది. ఈ డబ్బులో సందీప్‌కు సాయం చేసిన ముగ్గురు స్నేహితులకు ఒక్కొక్కరికి లక్ష చొప్పున మొత్తం 3 లక్షలు ఇచ్చిందని సమాచారం.

**నిందితుల అరెస్ట్, నగదు స్వాధీనం**

ఆదివారం ఉదయం మట్వాడ ఎస్సై బి శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి హనుమాన్ జంక్షన్ వద్ద వాహన తనిఖీ నిర్వహిస్తుండగా, TS11 UC0178 నంబర్ గల స్విఫ్ట్ డిజైర్ కారులో ప్రయాణిస్తున్న సందీప్, పద్మలను గుర్తించి పట్టుకున్నారు. వారిని విచారించగా హత్యా యత్నం, డబ్బుతో పరారైన విషయం వెలుగులోకి వచ్చింది. నిందితుల నుంచి రూ. 5,40,000 నగదు, హత్యాయత్నానికి ఉపయోగించిన కారు, రెండు స్మార్ట్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్న వివరాలను మట్వాడ సీఐ ఎన్ కరుణాకర్ రావు మీడియాకు వెల్లడించారు. ఈ కేసులో ఇంకా ఇతరులు ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఈ హత్యాయత్నం సంఘటన ఇప్పుడు వరంగల్ నగరంలో చర్చనీయాంశంగా మారింది.

## వరద బాధితులకు అండగా కంది శ్రీనివాస రెడ్డి


**ఆహారం, అల్పాహారం పంపిణీ**

### బాధితులకు అందించిన కేఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు, కాంగ్రెస్ శ్రేణులు

**ఆదిలాబాద్ మహా :** ఆపత్కాలంలో అత్యవసర సమయాలలో తన ఫౌండేషన్ సేవలు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటాయని కంది శ్రీనివాస రెడ్డి చెబుతుంటారు. అన్నట్లుగానే శనివారం వర్ష బీభత్సానికి నీటమునిగిన కాలనీలకు కనీసం వండుకునే స్థితిలో లేని కుటుంబాలకు తన ఫౌండేషన్ సభ్యులు ,కాంగ్రెస్ కార్యకార్తలచే ఆహారం పంపిణీ చేయించారు. పట్టణంలోని పలు కాలనీలలో దాదాపు 5 వందల మందికి ఆహారం పంపిణీ చేసినట్టు సభ్యులు తెలిపారు. అలాగే నేటి ఉదయం కూడా ఇంకా లోతట్టు ప్రాంతాలకు చెందిన వారి ఇళ్లల్లో వండుకునే స్థితి లేదని తెలిసి అల్పాహారం పంపిణీ చేయించారు.వాన ,వరద తాకిడికి ఇళ్లలోకి నీరు చేరి ఎన్నో కుటుంబాలు కలితో ఇబ్బందులు పడకూడదని కంది శ్రీనివాస రెడ్డి ఆహారం పంపించినట్టు సభ్యులు తెలిపారు. ఆపద సమయంలో అండగా నిలుస్తున్న కంది శ్రీనివాస రెడ్డి కి బాధితులు ధన్యవాదములు తెలిపారు.



# పిల్లలు కనడానికి సిద్ధమవుతున్న రోబోలు!




స్త్రీ, పురుషుల కలయికతో పిల్లలు పుట్టడం సర్వసాధారణం. ఇప్పుడు టెక్నాలజీ పెరగడంతో టెస్ట్ ట్యూబ్ బేబీలు పుడుతున్నారు. సరోగసీ ద్వారా కూడా పిల్లలను కంటున్నారు. అయితే శిశువు పుట్టడానికి మనిషి గర్భమే అవసరం లేదంటూ.. చైనా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. దీనికోసం ప్రత్యేకంగా 'గర్భధారణ రోబోట్'లను సృష్టిస్తున్నారు. వినడానికి ఇది వింతగా ఉన్నా.. దీనికి సంబంధించిన మరిన్ని ఆసక్తికరమైన విషయాలు తెలుసుకోవాలంటే, ఈ కథనం చదవాల్సిందే.. ప్రపంచంలోనే మొట్టమొదటి 'గర్భధారణ రోబోట్'పై చైనా శాస్త్రవేత్తలు పని చేస్తున్నారని, ఇది సజీవ శిశువుకు జన్మనిస్తుందని ది టెలిగ్రాఫ్ నివేదించింది. ఈ టెక్నాలజీ గర్భధారణ నుంచి ప్రసవం వరకు గర్భధారణకు కావలసిన అన్ని విషయాలను అనుకరిస్తుందని నిపుణులు పేర్కొన్నారు. పిండం అనేది గర్భధారణ రోబో.. కృత్రిమ గర్భంలోనే పెరుగుతుంది. పిండాలకు కావలసిన పోషకాలు అన్నీ కూడా ట్యూబ్స్ ద్వారా అందిస్తారు. అయితే అండం, స్పెర్మ్ ఎలా.. ఎక్కడ ఫలదీకరణం అవుతుందనే విషయాలను ప్రస్తుతానికి శాస్త్రవేత్తలు వెల్లడించలేదు. సింగపూర్‌లోని నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్త డాక్టర్ 'జాంగ్ కిఫెంగ్' నేతృత్వంలోని గ్వాంగ్‌జౌకు చెందిన కైవా టెక్నాలజీ ఈ రోబోను అభివృద్ధి చేస్తోంది. ఈ టెక్నాలజీ విజయవంతమైతే.. సంతానం లేని జంటలకు లేదా జీవసంబంధమైన గర్భధారణ చేయించుకోవడానికి ఇష్టపడని వారికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ప్రస్తుతం ఈ టెక్నాలజీ పరిణతి చెందిన దశలో ఉందని డాక్టర్ జాంగ్ పేర్కొన్నారు. పిండం.. రోబోట్ కృత్రిమ గర్భంలో పెరగడానికి కావలసిన జాగ్రత్తలు తీసుకుంటున్నాము. ఈ రోబోట్ నమూనా 2026 నాటికి అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. మనిషి గర్భంతో పనిలేకుండా రాబోయే టెక్నాలజీ బాగానే ఉంది. కానీ ఇది ప్రతికూల ప్రభావాలకు దారి తీస్తుందేమో అని కొందరు అభిప్రాయపడుతున్నారు. తల్లి, బిడ్డల పేగు బంధం లేకపోతే.. పిల్లల మానసిక ప్రభావం ఎలా ఉండబోతుందో అని ఆందోళన చెందుతున్నారు. అంతే కాకుండా ఇది చట్టపరంగా సాధ్యమేనా?, చట్టాలు దీనికి ఒప్పుకుంటాయా అనే అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు.

# ఆ రాష్ట్రంలో భారీగా బయటపడ్డ బంగారు నిక్షేపాలు



భారతదేశంలో బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. తులం గోల్డ్ రేటు లక్ష రూపాయలు దాటేసి చాలా రోజులైంది. ఇలాంటి సమయంలో ఒడిశాలో భారీ స్థాయిలో బంగారు ఖనిజ నిక్షేపాలు ఉన్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (GSI) వెల్లడించింది. దేవ్‌ఘర్‌లో బంగారు నిక్షేపాలు ఉన్నట్లు నిర్ధారించారు. అయితే సుందర్‌గఢ్, నబరంగ్‌పూర్, కియోంఝర్, అంగుల్, కోరాపుట్‌లలో మాత్రమే కాకుండా.. మయూర్‌భంజ్, మల్కన్‌గిరి, సంబల్‌పూర్, బౌధ్‌లలో అన్వేషణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు.. ఒడిశాలో బంగారు నిక్షేపాల నిల్వలు ఎంత ఉన్నాయనే విషయం అధికారికంగా వెల్లడికాలేదు. అయితే నిల్వలు 10 నుంచి 20 మెట్రిక్ టన్నులు ఉండే అవకాశం ఉందని విశ్లేషకుల అంచనా.ఇది భారతదేశం దిగుమతి చేసుకుంటున్న బంగారం పరిమాణంతో పోలిస్తే ఇది చాలా తక్కువ. గత సంవత్సరం భారతదేశం 700 800 మెట్రిక్ టన్నుల బంగారాన్ని దిగుమతి చేసుకుంది. దేశంలో గోల్డ్ ఉత్పత్తి తక్కువగా ఉండటమే ఎక్కువగా దిగుమతి చేసుకోవడానికి ప్రధాన కారణం. ప్రస్తుతం ఉత్పత్తి పరిమాణం పెరిగే అవకాశం ఉంటుంది. దిగుమతి కొంత తగ్గుతుందని పలువురు భావిస్తున్నారు.

## ఇండియా స్మార్ట్‌ఫోన్లలో ఈ ఫీచర్.. ఇదే ప్రథమం



స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ ఒప్పో ఇండియా తాజాగా కే13 టర్బో సిరీస్ ప్రో 5జీ, టర్బో 5జీ ఫోన్లను ఆవిష్కరించింది. వీటిలో అంతర్గతంగా కూలింగ్ ఫ్యాన్ ఉంటుందని, దేశీయంగా స్మార్ట్‌ఫోన్లలో ఈ ఫీచరును అందించడం ఇదే ప్రథమం అని సంస్థ తెలిపింది. భారీగా మల్టీ టాస్కింగ్, గేమింగ్‌కి అనువుగా ఇవి ఉంటాయని వివరించింది. 7000 ఎంఏహెచ్ బ్యాటరీ, 80 వాట్స్ సూపర్‌వూక్ ఫాస్ట్ చార్జింగ్, 1.5 అమోలెడ్ డిస్‌ప్లే తదితర ఫీచర్లు వీటిలో ఉన్నాయి. దీని ధర రూ. 27,999 నుంచి ప్రారంభం అవుతుంది. అయితే, ఆఫర్లను కూడా పరిగణనలోకి తీసుకుంటే రూ. 24,999 నుంచి లభిస్తుందని సంస్థ తెలిపింది. టర్బో ప్రో 5జీ ఫోన్ల సేల్ ఆగస్టు 15 నుంచి, టర్బో 5జీ ఫోన్ల అమ్మకాలు 18 నుంచి ప్రారంభమవుతాయి.

**ముఖ్యమైన ఫీచర్లు**

ఇండియాలో మొట్టమొదటి సారిగా అంతర్గత కూలింగ్ ఫ్యాన్ ఉన్న స్మార్ట్‌ఫోన్

గేమింగ్, మల్టీటాస్కింగ్ కోసం ప్రత్యేకంగా రూపొందింది.

ట్రిపుల్‌లెవల్ కూలింగ్ సిస్టమ్: కూలింగ్ ఫ్యాన్, ఎయిర్ డక్ట్స్, 5000mm వేపర్ చాంబర్.

ప్రాసెసర్: స్నాప్‌డ్రాగన్ 8ఎస్ జెన్ 4 ఎస్‌ఓసీ

ర్యామ్ & స్టోరేజ్: 8జీబీ/12జీబీ ఎల్‌పీడీడీఆర్ 5ఎక్స్ ర్యామ్, 256జీబీ యూఎఫ్‌ఎస్ 4.0 స్టోరేజ్.

డిస్‌ప్లే: 6.8 అంగుళాల ఎల్‌టీపీఎస్ అమోల్డ్ డిస్‌ప్లే, 120Hz రిఫ్రెష్ రేట్, హెచ్‌డీఆర్ 10+, 1500 నిట్స్ బ్రైట్‌నెస్.

బ్యాటరీ: 7000mAh, 80 వాట్ల ఫాస్ట్ చార్జింగ్ (15 నిమిషాల్లో 50%).

కెమెరా: 50MP + 2MP రియర్, 16MP ఫ్రంట్, 4K 60fps వీడియో సపోర్ట్.

సాఫ్ట్‌వేర్: ఆండ్రాయిడ్ 15 ఆధారిత కలర్‌ఓఎస్ 15, 2 ఓఎస్ అప్‌డేట్లు, 3 ఏళ్లు సెక్యూరిటీ ప్యాచ్‌లు

**ధర & లభ్యత**

కే13 టర్బో ప్రో 5జీ ఫోన్ ప్రారంభ ధర రూ.37,999 కాగా డిస్కౌంట్‌లో రూ. 34,999 లకు లభిస్తుంది. అలాగే కే13 టర్బో 5జీ ఫోన్ ధర రూ. 27,999 కాగా తగ్గింపులు పోగా రూ. 24,999 లకు లభిస్తుంది. ఈ ఫోన్లు ఫ్లిప్‌కార్ట్, ఒప్పో ఈస్టోర్లు, ఇతర ఆఫ్‌లైన్ స్టోర్స్ ద్వారా అందుబాటులో ఉంటాయి.



# రూ.1.30 లక్షలు తగ్గిన ధర

## ఇప్పుడు ఈ బైక్ రేటు ఎంతంటే?

భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన కవాసకి 'కేఎల్‌ఎక్స్230' బైకును రూ. 1.99 లక్షల (ఎక్స్‌షోరూమ్, ఇండియా) ధరకు అందిస్తోంది. గత ఏడాది ఇండియన్ మార్కెట్లో లాంచ్ అయిన ఈ బైక్ ధర రూ. 3.30 లక్షలు. అంటే సంస్థ ధరను లోకలైజేషన్ కారణంగా ఇప్పుడు రూ. 1.30 లక్షలు తగ్గించింది. స్థానీకరణ కారణంగానే కంపెనీ తన కేఎల్‌ఎక్స్230 ధరను చాలా తగ్గించింది. ఇప్పుడు దేశీయ మార్కెట్లో ఈ బైక్ హీరో Xpulse 210, కేటీఎం 390 ఎండ్యూరో ఆర్ వంటి వాటికి ప్రత్యర్థిగా ఉంటుంది. కంపెనీ తన కేఎల్‌ఎక్స్230 బైకును స్థానీకరణ చేయడం మాత్రమే కాకుండా.. కొన్ని యాంత్రిక మార్పులను కూడా చేసింది. ముందు భాగంలో 20 మిమీ, వెనుక 27 మిమీ సస్పెన్షన్ తగ్గించింది. అయితే రెండు చివర్లలో ఇప్పుడు పెద్ద డిస్క్ బ్రేక్‌లు ఉన్నాయి. 233 సీసీ సింగిల్‌సిలిండర్ ఇంజిన్ 19 హార్స్ పవర్, 19 ఎన్‌ఎమ్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇంజిన్ 6 స్పీడ్ గేర్‌బాక్స్ పొందుతుంది. డ్యూయెల్ ఛానల్ ఏబీఎస్ కూడా ఈ బైకులో లభిస్తుంది.

# గూగుల్‌లో పర్సనల్ ఇంటర్వ్యూలు: సుందర్ పిచాయ్



ఒకప్పుడు ఇంటర్వ్యూ అంటే.. ముఖాముఖి నిర్వహించేవాళ్ళు. టెక్నాలజీ పెరిగిన తరువాత వర్చువల్ విధానంలో ఇంటర్వ్యూలు చేయడం మొదలైంది. ఈ విధానం ద్వారా ఇంటర్వ్యూలు జరిపితే.. కొందరు మోసాలకు పాల్పడుతున్నారు. కాబట్టి వర్చువల్ విధానంలో జరిగే ఇంటర్వ్యూలపై గూగుల్ సీఈఓ కీలక వ్యాఖ్యలు చేశారు. వర్చువల్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తుంటే అభ్యర్థులు కొందరు మోసం చేస్తున్నారు. ఇలాంటి వాటిని నివారించడానికే గూగుల్ కంపెనీలో మళ్ళీ వ్యక్తిగత ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు 'సుందర్ పిచాయ్' పేర్కొన్నారు. ఏఐ వినియోగం పెరుగుతున్నందున వర్చువల్ ఇంటర్వ్యూలు సమంజసం కాదని కంపెనీలోని ఉద్యోగులు కూడా డిమాండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. వర్చువల్ ఇంటర్వ్యూల ద్వారా.. ఇంటర్వ్యూలను షెడ్యూల్ చేయడం సులభం. అంతే కాకుండా శ్రమ, వ్యయం కూడా తగ్గుతాయి. అయితే కొందరు మోసం చేయడం మొదలుపెట్టారు. దీనిని దృష్టిలో ఉంచుకునే.. ఇంటర్వ్యూ చేయదలచిన అభ్యర్థిని, కనీసం ఒక్కసారైనా వ్యక్తిగతంగా ఇంటర్వ్యూ చేయాలని నిర్ణయించుకున్నట్లు సుందర్ పిచాయ్ వెల్లడించారు. ప్రస్తుతం ఈ సమస్య ఎదుర్కొంటున్న కంపెనీల జాబితాలో గూగుల్ మాత్రమే కాకుండా.. అమెజాన్, ఆంత్రోపిక్ , సిస్కో, మెకిన్సే వంటి కంపెనీలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం పరిస్థితులను చూస్తుంటే.. కంపెనీలన్నీ వర్చువల్ ఇంటర్వ్యూ విధానానికి మెల్లగా చరమగీతం పాడేసి, మళ్ళీ వ్యక్తిగత ఇంటర్వ్యూలకే ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంటుందని స్పష్టంగా తెలుస్తోంది.



# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL




# ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా రాధాకృష్ణన్



**ఢిల్లీ:** ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగి సీపీ రాధాకృష్ణన్‌ను ఎంపిక చేశారు. ప్రస్తుత మహారాష్ట్ర గవర్నర్‌గా ఉన్న సీపీ రాధాకృష్ణన్.. స్వస్థలం తమిళనాడు. సీపీ రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపిక చేస్తూ బీజేపీ పార్లమెంటరీ బోర్డు మీటింగ్‌లో నిర్ణయం తీసుకున్నారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు మీటింగ్ అనంతరం సీపీ రాధాకృష్ణన్ ఎంపికపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా మీడియాకు స్పష్టం చేశారు. ఎన్డీఏ పక్షాలు ఉపరాష్ట్రపతి అభ్యర్థి బాధ్యతలను ప్రధాని నరేంద్ర మోదీ, జేపీ నడ్డాలకు అప్పగించారు. ఈ మేరకు బీజేపీ పార్లమెంటరీ సభ్యులు భారత ఉపరాష్ట్రపతిగా రాధాకృష్ణన్ ఎంపిక చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి ఎంపికలో సమతుల్యత పాటించింది కేంద్రం. రాష్ట్రపతి ముర్ము ఉత్తరాది వాసి కాగా, ప్రస్తుతం ఎంపిక చేసిన ఎన్డీఏ ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్ దక్షిణాది వాసి. ఇదిలా ఉంచితే, ఆగస్టు 21తో నామినేషన్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఎన్డీఏ తమ అభ్యర్థిని ముందుగా ప్రకటించింది. ఇక సెప్టెంబర్ 9వ తేదీ ఉపరాష్ట్రపతి ఎన్నిక జరుగనుంది. కాగా, సీపీ రాధాకృష్ణన్.. బీజేపీ నాయకుడు. ఆయన రెండుసార్లు కోయంబత్తూరు లోక్‌సభ నియోజకవర్గం నుండి ఎంపీగా గెలిచారు. తమిళనాడు బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా కూడా సేవలందించారాయన. 2023 ఫిబ్రవరి 12న జార్ఖండ్ గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తెలంగాణ గవర్నర్‌గా పనిచేసిన తమిళిసై సౌందరరాజన్.. 2024 మార్చి 18న రాజీనామా చేయడంతో తెలంగాణ గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ అదనపు బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఉన్న సీపీ రాధాకృష్ణన్‌కు తెలంగాణ గవర్నర్‌గా అదనపు బాధ్యతలును అప్పగించారు. 2024 జులై 31 వరకు తెలంగాణ గవర్నరుగా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. 2024 ఆగస్టు 06 వరకు పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా పనిచేశారు. ఆపై మహారాష్ట్ర గవర్నర్‌గా ఎంపికయ్యారు.

# అమెరికాలో కాల్పుల మోత.. ఉలిక్కిపడిన న్యూయార్క్



**వాషింగ్టన్:** అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం సృష్టించాయి. స్థానిక కాలమానం ప్రకారం న్యూయార్క్ నగరంలో ఆదివారం ఉదయం 3.30గంటల సమయంలో జరిగిన కాల్పుల మోతతో న్యూయార్క్ నగరం ఒక్కసారిగా ఉలిక్కి పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు న్యూయార్క్ సిటీ బ్రూక్లిన్ ప్రాంతంలోని క్రౌన్ హైట్స్‌లో ఉన్న 'టేస్ట్ ఆఫ్ ది సిటీ లాంజ్' అనే రెస్టారెంట్‌లోకి చొరబడ్డ అగంతకుడు కాల్పులకు తెగబడ్డాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మరణించారు. ఎనిమిదిమంది గాయపడ్డారు. కాల్పులపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ క్షతగాత్రుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. కాల్పుల ఘటనపై న్యూయార్క్ సిటీ పోలీస్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ జెస్సికా టిష్ స్పందించారు. కాల్పులకు తెగబడ్డ నిందితుల్ని అరెస్ట్ చేయలేదని తెలిపారు. ఘటన స్థలంలో కనీసం 36 బుల్లెట్ కేసింగ్స్‌ను సేకరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా,ఈ కాల్పులు న్యూయార్క్ నగరంలో జరిగిన తీవ్రమైన కాల్పుల ఘటనల్లో ఒకటిగా భావిస్తున్నారు

# పుతిన్ పైచేయి!

## అలాస్కాలో అడుగుపెట్టింది మొదలు వెళ్లేదాకా తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిన పుతిన్

## యుద్ధం, శాంతి, కాల్పుల విరమణ పదాలను మాటవరసకైనా ప్రస్తావించని ట్రంప్



ఉక్రెయిన్‌పై దురాక్రమణ దండయాత్ర మొదలెట్టాక రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు అంతర్జాతీయంగా ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. అమెరికాసహా పలు దేశాల నుంచి అంతర్జాతీయ ఆంక్షలు, యుద్ధ నేరాలకు పాల్పడ్డారంటూ అరెస్ట్ వారెంట్‌లు, సైబర్ దాడులతో శత్రు దేశాలు చుట్టుముట్టినా ఏమాత్రం బెదరక పుతిన్ తన తిరుగులేని ఆధిపత్యాన్ని ట్రంప్ సమక్షంలోనే ప్రదర్శించి రష్యాకు ఎదురులేదని నిరూపించారు. సంయుక్త ప్రకటన సమయంలోనూ ట్రంప్ కంటే ముందే మాట్లాడి తన వాదనను మొదటే గట్టిగా వినిపించారు. దాదాపు 13 నిమిషాలపాటు సంయుక్త ప్రకటన చేస్తే అందులో అగ్రభాగం 8 నిమిషాలు పుతినే మాట్లాడాడు. దాంతో ట్రంప్ చివర్లో మమ అనిపించి ప్రసంగాన్ని ముగించారు. ట్రంప్‌తో భేటీ పర్వంలో అడుగడుగునా పుతిన్ తన పైచేయిని ప్రదర్శించడం విశేషం.

**ఎర్రతివాచీ స్వాగతంలో తొలి గెలుపు**

ఉక్రెయిన్‌తో శాంతి ఒప్పందం కుదుర్చు కోకుంటే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరికలను స్వీకరించిన ట్రంప్ నుంచే స్వయంగా రెడ్‌కార్పెట్ సాదర స్వాగతాన్ని పొంది పుతిన్ తన రష్యాకు అంతర్జాతీయంగా ప్రభ ఏమాత్రం తగ్గలేదని నిరూపించారు. ఉక్రెయిన్ యుద్ధంలో లక్షలాది మంది అమాయక ఉక్రెయిన్ పౌరుల ప్రాణాలను బలితీసుకున్నారన్న అపవాదు ఉన్న దేశాధ్యక్షునికి అలస్కా ఎయిర్‌పోర్ట్‌లో సాధారణ స్వాగతంతో ట్రంప్ ముగిస్తే సరిపోయేది. కానీ అత్యంత ఆప్తుడైన మిత్రుడు తరలివస్తే ఎంతగా ప్రేమతో ఆహ్వానం పలుకుతామో అదేతరహాలో పుతిన్‌కు ట్రంప్ ఎర్రతివాచీ పరిచి మరీ సాదరంగా ఆహ్వానించారు. ప్రధాని మోదీ అమెరికాలో పర్యటించినప్పుడు కూడా సమహోదా ఉన్న ట్రంప్ స్వయంగా వెళ్లి ఎయిర్‌పోర్ట్‌లో స్వాగతం పలకలేదు. కానీ యుద్ధనేరారోపణలు ఎదుర్కొంటున్నాసరే స్వయంగా ట్రంప్ వెళ్లి పుతిన్‌కు స్వాగతం పలకడం ద్వారా అగ్రరాజ్యాధినేతకు తాను ఏమాత్రం తీసిపోనని పుతిన్ బహిరంగంగా నిరూపించారు.

ఉక్రెయిన్ మొదలయ్యాక దౌత్యపరంగా, ఆర్థికంగా, ఆంక్షల పరంగా రష్యా ఏకాకిగా తయారైందని పశ్చిమదేశాల మీడియా చెబుతున్నదంతా ఒట్టిమాటలేనని, అమెరికా దృష్టిలో పుతిన్ ఇప్పటికీ అత్యంత ప్రభావవంతమైన, శక్తివంతమైన ప్రపంచనేత అని రుజువైంది. ట్రంప్‌తో సోదరభావంతో మెలగడం, కరచాలనం, ఒకే కారులో ప్రయాణించడం ద్వారా తానూ ట్రంప్ ఒకేస్థాయి అని పుతిన్ అందరికీ స్పష్టంగా అర్థమయ్యేలా చేశారు.

**కాల్పుల విరమణ.. గప్‌చుప్**

ఉక్రెయిన్‌తో దాడులు ఆపి కాల్పుల విరమణను అమల్లోకి తేవడమే ఈ భేటీ ప్రధాన లక్ష్యం. అలాంటి కీలక 'కాల్పుల విరమణ'పదాన్ని మాటవరసకైనా ట్రంప్ ప్రస్తావించకుండా పుతిన్ విజయవంతంగా కట్టడిచేశారు. మేమే 'ఆ మార్గం'లో ఇంకా పయనించలేదు. అక్కడి దాకా వెళ్లేందుకు ఇంకొన్ని అవరోధాలను అధిగమించాల్సి ఉంది అని మాత్రమే ట్రంప్ వ్యాఖ్యానించారుగానీ 'కాల్పుల విరమణ'అనే పదం పలకడానికి కూడా ఆయన సాహసించలేదు. తద్వారా పుతిన్ తన కనుసన్నల్లో, తాను అనుకున్నదే భేటీలో జరిగేలా తన ఆధిపత్యాన్ని ప్రదర్శించారు.

**పాక్షిక విజయం కూడా సాధించని ట్రంప్**

ఈ భేటీలో మా ప్రతిపాదనలకు పుతిన్ ఒప్పుకోకపోతే రష్యాపై మరోదఫా ఆంక్షలు విధిస్తానని రెండ్రోజుల ముందు ట్రంప్ చేసిన భీష్మప్రతిజ్ఞ ఉత్తిదేనని తేలిపోయింది. ఎలాంటి తుది నిర్ణయాలు తీసుకోకుండానే భేటీ ముగిసినా సరే ట్రంప్‌లో ఎలాంటి నిరసన, ఆందోళన కనిపించలేదు. పైగా పుతిన్ చేసిన మాస్కో పర్యటన ప్రతిపాదనకు ట్రంప్ సంతోషం వ్యక్తంచేయడం విచిత్రం. పైగా తాము అనుకున్న ఫలితాలు రాకపోయినా ట్రంప్.. పుతిన్‌తో చర్చలు సానుకూలంగా సాగాయని విరుద్ధమైన ప్రకటన చేయడం గమనార్హం. దీంతో భేటీపై ట్రంప్‌కు ఎలాంటి పట్టు సాధించలేకపోయారని అర్థమవుతోంది. భేటీ జరుగుతున్నాసరే రష్యా దాడులుచేసేలా పుతిన్ ఆదేశాలిచ్చి తన మొండి వైఖరిని మరోసారి చూపించారు.

**శాంతి చర్చలను వాణిజ్య చర్చలుగా మార్చిన పుతిన్**

యుద్ధం ఆపాలన్న డిమాండ్‌తో ముందుకొచ్చిన అమెరికాను వాణిజ్యచర్చలకు బలవంతంగా పుతిన్ కూర్చోబెట్టినట్లు ఈ భేటీ తర్వాత ప్రసంగాన్ని చూస్తే అర్థమవుతోంది. ''వాణిజ్యం, డిజిటల్, హై-టెక్, స్పేస్ వంటి రంగాల్లో అమెరికా-రష్యా పెట్టుబడులు, వాణిజ్య సహకారం మరింతగా బలపడనుంది. ఆర్కిటిక్‌లోనూ సహకారం బాగుంది''అని సంబంధంలేని విషయాలనూ పుతిన్ చెప్పుకొస్తున్నా ఆయనను అడ్డుకోవాల్సిందిపోయి ట్రంప్ ఆయనకు వంతపాడటం విచిత్రం. పుతిన్‌తోపాటు ట్రంప్ ఆ తర్వాత గొంతు కలుపుతూ.. ''రష్యా వ్యాపార భాగస్వాములు మాతో వాణిజ్యానికి ఉవ్విళ్లూరుతున్నారు''అని ట్రంప్ వ్యాఖ్యానించారు. తద్వారా శాంతి చర్చలను పుతిన్ విజయవంతంగా వాణిజ్యచర్చలుగా మార్చేశారు.

# పట్టాలు తప్పిన పాక్ రైలు

## ఒకరు మృతి, పలువురికి గాయాలు



**ఇస్లామాబాద్:** పాకిస్తాన్‌లో ఓ రైలు పట్టాలు తప్పింది. ఆదివారం నాడు లోధ్రాన్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పెషావర్ నుండి కరాచీకి వెళ్తున్న అవామ్ ఎక్స్‌ప్రెస్ రైలు లాహోర్‌కు దాదాపు 400 కి.మీ దూరంలో పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో నాలుగు కోచ్‌లు చెల్లాచెదురయ్యాయి. డిప్యూటీ కమిషనర్ లుబ్నా నజీర్ విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రమాదంలో ఒక ప్రయాణికుడు ప్రాణాలు కోల్పోగా, మరో 25 మంది గాయపడ్డారని, వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నదన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని, గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించాయి. అధికారులు దెబ్బతిన్న కోచ్‌లను పక్కకు తొలగిస్తున్నారు. ట్రాక్‌ను పునరుద్ధరించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఈ నెలలో పాక్‌లోని పంజాబ్‌లో ఇది మూడవ రైలు ప్రమాదం. కొన్ని రోజుల క్రితం ముసాపాక్ ఎక్స్‌ప్రెస్ రైవిండ్ వద్ద పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు గాయపడ్డారు. ఆగస్టు ప్రారంభంలో ఇస్లామాబాద్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. నాడు 10 కోచ్‌లు బోల్తాపడి, 30 మంది గాయపడ్డారు. వరుస రైలు ప్రమాదాలు ప్రయాణికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

08 మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | సోమవారం, హైదరాబాద్ | 18-08-2025
ANN తెలుగు



# నిర్మాతలు మా పై దుష్ప్రచారాలను మానండి

టాలీవుడ్‌లో గత కొన్నిరోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నారు. అయితే తమకు 30 శాతం వేతనాలు పెంచాలని వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేస్తుండగా.. నిర్మాతలు మాత్రం దీనికి అంగీకరించట్లేదు. తమ షరతులకు ఒప్పుకొంటేనే వేతనాల పెంపు ఉంటుందని అంటున్నారు. దీంతో ఈ సమస్య ఎటు తేలకుండా అలానే ఉంది. మెగాస్టార్ చిరంజీవి.. ఆదివారం పలువురు చిన్న నిర్మాతలు కలిశారు. సోమవారం ఫిల్మ్ ఫెడరేషన్ సభ్యులు కలవనున్నారు. ఈ క్రమంలోనే ప్రొడక్షన్ అసిస్టెంట్ యూనియన్ ప్రెసిడెంట్ తమ సాధకబాధలు చెప్పుకొచ్చారు. 'రోజూ ఉదయం 5 గంటలకు వస్తేనే మా బతుకు. పెద్ద పెద్ద సినిమాలు తీసిన అప్పటి నిర్మాతలు మా కష్టాన్ని పట్టించుకునే వారు. కానీ ఇప్పటి నిర్మాతలకు మా గోడు పట్టడం లేదు. మాకు వచ్చే డబ్బులు.. మాకొస్తున్న జబ్బులకు సరిపోతుంది. కొందరు నిర్మాతలు వ్యక్తిగతంగా మమ్మల్ని దూషిస్తున్నారు. కార్మిక చట్టాల బట్టి అంటున్నారు మరి మీరు 8 గంటల వర్క్ చేయించుకుంటున్నారా ?? 1214 గంటలు మేము పనిచేస్తున్నాం. 9 నుంచి 9 గంటల వరకు అని కొందరు నిర్మాతలు అంటున్నారు కానీ అది అయ్యే పనికాదు. షూటింగ్స్‌కి రావాలి అంటే మేము 9 గంటలకు కాకుండా మా వర్కర్స్‌ని 7 గంటలకే రమ్మనాలి. రాత్రి 9 గంటలకే షూట్ ముగిస్తారా అంటే అది చేయరు. మేము షూటింగ్ ముగించుకుని వచ్చేపాటికి రాత్రి ఒంటి గంట అయిపోతుంది' '12 గంటలు అంటారు కానీ మేము 1516 గంటలు వర్క్ చేస్తున్నాం. కార్మిక చట్టాలు ప్రకారం వెళ్దామని కొందరు నిర్మాతలు అంటున్నారు మాకు అభ్యంతరం లేదు. చట్ట ప్రకారమే మాకు 8 గంటలు పని గంటలు ఉంటాయి. డొనేషన్ తీసుకుంటున్న డబ్బులతో ఆ కుటుంబానికి అండగా ఉంటున్నాం. యూనియన్ ఎప్పుడు కార్మికుడికి అండగా ఉంటుంది నిర్మాతలు ఉండటం లేదు. మా గురువు గారు దాసరి.. అప్పుడు చెప్పిన పద్ధతి లోనే మేము వెళ్తున్నాం. నిర్మాతలు మా పై చేస్తున్న దుష్ప్రచారాలను మానండి. చిరంజీవి గారికి మా సమస్యలు తెలుసు. మా సమస్యని పరిష్కరించాలని కోరుకుంటున్నాం' అని ప్రొడక్షన్ అసిస్టెంట్ యూనియన్ ప్రెసిడెంట్ వెంకట కృష్ణ చెప్పారు. సినీ కార్మికుల మహిళా యూనియన్ ప్రెసిడెంట్ లలిత మాట్లాడుతూ.. మేము షూటింగ్‌లో ఎంతో కష్టపడతాం. మాకు టాయిలెట్స్ కూడా ఉండవు. వాటర్ కేన్స్ కూడా భుజాన మోసుకొని వెళ్ళాలి. మా బాధలు నిర్మాతలు అర్థం చేసుకోవాలి. సండే కట్ చేస్తాం అంటున్నారు అలా చేస్తే మా పొట్ట కొట్టినట్టే. ప్రభుత్వం తరపున మీటింగ్ పెడితే మా కష్టాలు తెలియ చేస్తాం అని అన్నారు.

### దర్శకుడిగా షారుక్ ఖాన్ కుమారుడు..

# ఫస్ట్ లుక్ వీడియో అదుర్స్



బాలీవుడ్ ప్రముఖ నటుడు షారుక్ ఖాన్ కుమారుడు ఆర్యన్ ఖాన్ దర్శకుడిగా తెరకెక్కిస్తున్న 'ది బా***డ్స్ ఆఫ్ బాలీవుడ్' ఫస్ట్ లుక్ విడుదలైంది. అయితే, సినిమా కాకుండా వెబ్‌సిరీస్ కోసం తొలిసారి మెగా ఫోన్ పట్టాడు. ఈ చిత్రాన్ని 'నెట్‌ఫ్లిక్స్' 'రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్' సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. ఆగష్టు 20న ప్రివ్యూ ఉంటుందని నెట్‌ఫ్లిక్స్ ప్రకటించింది. అయితే, ఈ మూవీకి కథ కూడా ఆర్యన్ రాయడం విశేషం. బాలీవుడ్‌లో ఇప్పటివరకూ చూడని సరికొత్త వెబ్‌సిరీస్‌ను అందించబోతున్నామని గతంలోనే ఆర్యన్ యూనిట్ ప్రకటించింది. ఈ వీడియోలో ఆర్యన్ వాయిస్ ఓవర్‌తో కథనం ప్రారంభమౌతుంది. కానీ, అతని తండ్రి షారుఖ్ ఖాన్ శైలిలో వీడియో ఉంది. తేడా ఏమిటంటే ఖాన్ ప్యార్ (ప్రేమ) గురించి మాట్లాడగా, కుమారుడు వార్ (దాడి) గురించి మాట్లాడుతాడు. ఇందులో బాబీ డియోల్, లక్ష్య (Kill ఫేమ్), మనోజ్ పహ్వా, మోనా సింగ్, మనీష్ చౌదరి, రాఘవ్ జుయల్, అన్య సింగ్ వంటి స్టార్స్ నటించనున్నారు. షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్, అలియాభట్ వంటి స్టార్స్ కూడా ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారని సమాచారం.

# అల్లు అర్జున్ సినిమా..

## పవర్‌ఫుల్ పాత్రలో శివగామి



శక్తిమంతమైన పాత్రల్లో రమ్యకృష్ణ ఏ స్థాయిలో విజృంభించగలరో చెప్పడానికి 'రాజమాత శివగామి' పాత్ర ఒక ఉదాహరణ. 'బాహుబలి'లోని ఆ పాత్రను రమ్యకృష్ణ మాత్రమే చేయగలరు అనేలా ఆమె నటించారు. ఇప్పుడు ఈ పాత్ర ప్రస్తావన ఎందుకంటే... మరోసారి ఈ తరహా పవర్‌ఫుల్ రోల్‌లో రమ్యకృష్ణ కనిపించనున్నారట. అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలోని ఓ పవర్‌ఫుల్ క్యారెక్టర్ చేయాలంటూ రమ్యకృష్ణను సంప్రదించారట అట్లీ. రమ్యకృష్ణ కూడా తన అంగీకారం తెలి పారని సమాచారం. ఈ చిత్రంలో అల్లు అర్జున్ పలు షేడ్స్ ఉన్న పాత్రల్లో కనిపిస్తారని భోగట్టా. అలాగే మొత్తం ఐదుగురు కథానాయికలు ఉంటారని సమాచారం. హీరోయిన్ దీపికా పదుకోన్ నటిస్తున్నట్లు యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఇంకా మృణాల్ ఠాకూర్, రష్మికా మందన్నా, జాన్వీ కపూర్ పేర్లు వినిపిస్తున్నాయి. ఇక భారీ ఎత్తున వీఎఫ్ఎక్స్ ఉన్న ఈ సైంటిఫిక్ యాక్షన్ థ్రిల్లర్ మూవీకి పలువురు హాలీవుడ్ సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ చిత్రం విడుదల కానుంది.



తక్కువ కాలంలోనే ఎక్కువ పేరు తెచ్చుకొని స్టార్ ఇమేజ్‌ను సొంతం చేసుకున్న నటి కీర్తిసురేష్ . మలయాళంలో బాల తారగా కెరీర్ ప్రారంభించిన ఈ కేరళ కుట్టి, ఆ తర్వాత కథానాయకిగా అవతారమెత్తి మలయాళం, తమిళం, తెలుగు, హిందీ భాషల్లో నటించి పాన్ ఇండియా కథానాయకిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా మహానటి చిత్రంలో దివంగత నటి సావిత్రి పాత్రలో జీవించి జాతీయ ఉత్తమనటి అవార్డును గెలుచుకున్నారు. అదేవిధంగా తక్కువ

# బరువు తగ్గాను.. మళ్లీ కథలు వింటున్నా: కీర్తి సురేష్

కాలంలోనే ఉమెన్ సెంట్రిక్ కథా చిత్రాల్లో నటించి పేరు తెచ్చుకున్నారు. ఇకపోతే కథానాయకిగా బిజీగా ఉన్న సమయంలోనే తన బాల్య స్నేహితుడిని పెళ్లి చేసుకుని సంసార జీవితంలోకి అడుగుపెట్టారు. ప్రస్తుతం ఈమె చేతిలో రివాల్వర్ రీటా, కన్నివెడి చిత్రాలు ఉన్నాయి. అయితే వివాహానంతరం కీర్తిసురేష్ కొత్త చిత్రాలకు కమిట్ కాలేదు. అయినా ఖాళీగా లేరు. వాణిజ్య ప్రకటనల్లో నటిస్తూ బిజీగానే ఉన్నారు. అదేవిధంగా సామాజిక మాధ్యమాల్లోనూ చాలా యాక్టివ్‌గా ఉంటున్నారు. కాగా వివాహానంతరం ఈ అమ్మడు కాస్త బరువెక్కారనే కామెంట్స్‌ను ఎదుర్కొన్నారు. అలాంటి కామెంట్స్‌పై స్పందించిన కీర్తిసురేష్ పెళ్లి తర్వాత బరువు పెరిగిన విషయం నిజమేనన్నారు.. అయితే బరువు తగ్గడానికి కార్డియో కసరత్తులు చేసి స్లిమ్‌గా మారడానికి పోరాడానన్నారు. వారానికి 300 నిమిషాలు ప్రకారం ఎక్సర్‌సైజ్ చేసి ఇప్పుడు 9 కిలోల బరువు తగ్గినట్లు చెప్పారు. తీవ్ర ప్రయత్నం, ఆహారపు కట్టుబాట్లు కలిస్తే ఫలితం సాధ్యమేనని కీర్తి పేర్కొన్నారు. కాగా ప్రస్తుతం నూతన చిత్రాలకు సంబంధించిన కథలు వింటున్నానని, త్వరలోనే వాటికి సంబంధించిన వివరాలను ప్రకటిస్తానని ఆమె తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com